# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక



తీన్మార్ మెలోక్కల్పు

చట్టం & న్యాయం లపై.....

తీన్మార్ తెలుగు దిన పత్రిక

తలపెట్టిన మెలోక్కల్పు కార్యక్రమంలో

భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు

రచనలు, కవితలు & వ్యాసాలు

-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-

teenmaardesk@gmail.com



ములుగు | సంపుటి: 04 | సంచిక: 265 | పేజీలు : 8 | గురువారం 2 ఏప్రిల్ 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad




## పారాక్వెట్ గడ్డిమందుపై

# 60 రోజుల నిషేధం

### ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ




**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):**

ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 60 రోజుల పాటు పారాక్వెట్ గడ్డిమందు – అమ్మకాలు, నిల్వలు, వినియోగంపై నిషేధం విధించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలు ఉల్లఘించి పారాక్వెట్ మందు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇటీవల ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రంలో పారాక్వెట్ - మిగతా2లో

## సామాన్యుడిపై

# 'మీసేవ' భారం

- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు ఇక రూ. 80
- ఒకేసారి 50 శాతం మేర పెంపు
- సర్వీసు ఛార్జీలను భారీగా పెంచుతూ సర్కార్ నిర్ణయం
- తక్షణమే అమల్లోకి వచ్చిన కొత్త ధరలు




**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల నిర్వహణ ఖర్చులు పెరగడం, నిర్వాహకుల విజ్ఞప్తుల మేరకు తెలంగాణ ప్రభుత్వం సర్వీసు ధరలను పెంచుతూ అధికారికి ఉత్తర్వుల విడుదల చేసింది. తాజాగా విడుదల చేసిన జీవో ప్రకారం పెరిగిన ధరలు తక్షణమే అమలులోకి రానున్నాయి. ఆదాయ ధ్రువీకరణ పత్రం గతంలో రూ.45 నుంచి రూ.55 ఉండగా రూ.80కి చేరింది. - మిగతా2లో



## సోషల్ మీడియాపై కేంద్రం ఉక్కుపాదం

- కంటెంట్ క్రియేటర్లే ఇకపై న్యూస్ పబ్లిషర్లు
- ఐటీ నిబంధనల సవరణకు ముసాయిదా విడుదల
- దేశ భద్రత పేరిట కఠిన చర్యలు

2




## ప్రపంచ యవనికపై శ్రీ చైతన్య విజయకేతనం

## తెలంగాణ ఖజానాకు

# మద్యం కిక్కు

- మద్యం విక్రయాల్లో సరికొత్త రికార్డు
- రూ. 40,209 కోట్లకు చేరిన ఆదాయం
- ఏడేళ్లలో రెట్టింపు వృద్ధి
- గత ఏడాదితో పోలిస్తే 7శాతం పెరుగుదల
- లైసెన్స్ ఫీజులు మరియు దరఖాస్తుల ద్వారా భారీ రాబడి




**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 01 (తీన్మార్ తీన్మార్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర ఖజానాకు మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ప్రతి సంవత్సరం భారీగా పెరుగుతూ వస్తుంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖ ఏకంగా రూ. 40,209 కోట్ల - మిగతా2లో

# రెవెన్యూలో సరికొత్త విప్లవం

- ఇక భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ప్రారంభం
- ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ షురూ
- ఒకే గొడుగు కింద సర్వే, రిజిస్ట్రేషన్, ల్యాండ్ రికార్డులు

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):**

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో రెవెన్యూ శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకమైన, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు - మిగతా2లో




## మధ్యవర్తుల అక్రమాలకు

# అడ్డుకట్ట

### కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు "నేరుగా ఖాతాల్లోకే వేతనాలు"

### ఐఎఫ్ఎంఎస్ విధానం అమలు



**హైదరాబాద్, ఏప్రిల్ 02 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ - మిగతా2లో



## విభజన హామీలపై

# కేంద్రం వివక్ష

### బయ్యారం నుంచి కాజీపేట వరకు.. అందని హామీలు

### హామీలపై కేంద్రం తీరును తప్పుబట్టిన మంత్రి పొన్నం

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం బిల్లు ఆమోదించడాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పున విభజన చట్టం 2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి ముఖ్య ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదన్నారు. ఇవి తెలంగాణ అభివృద్ధికి కీలకమని ఆయన గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని దుయ్యబట్టారు. ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైంది కాదని తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు.

# తెలంగాణ ఖజానాకు మద్యం కిక్కు

-మొదటిపేజీ తరువాయి

ఆదాయాన్ని ఆర్జించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఈ ఆదాయం రూ.20,859 కోట్లుగా ఉండగా, కేవలం ఏడు సంవత్సరాల్లోనే ఇది రెట్టింపు స్థాయికి చేరుకోవడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం రూ.37,487 కోట్ల ఆదాయం రాగా ఈ ఏడు రూ.40,209 కోట్ల ప్రాఫిట్ వచ్చింది. అంటే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అదనంగా రూ. 2,722 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఇది సుమారు 7 శాతం వృద్ధిని సూచిస్తోంది.

లిక్కర్ వర్సెస్ బీరు అమ్మకాలు

2025-26 ఆర్థిక సంవత్సరంలో లిక్కర్ అమ్మకాలు స్వల్పంగా పెరగ్గా, బీరు అమ్మకాలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. లిక్కర 382.91 లక్షల కేసుల అమ్మకాలు జరిగ్గా బీరు 387.34 లక్షల కేసుల అమ్మకాలు జరిగాయి. కాగా, ఏడాదిలో 536.13 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరగడం గమనార్హం. ఈ మొత్తం ఏడాదిలో డిసెంబర్ నెలలో అత్యధికంగా రూ.5,051 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. అదేవిధంగా రాష్ట్రంలోని 2,620 లిక్కర్ షాపుల ద్వారా సంవత్సరానికి రెంటల్ ఫీజు రూపంలో రూ.1,771 కోట్ల ఆదాయం వస్తోంది. అలాగే 1,214 బార్ల ద్వారా రూ. 549 కోట్లు సమకూరుతున్నాయి. ఈ ఏడాది కొత్త షాపుల కోసం వచ్చిన 95,628 దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి అదనంగా రూ.2,869 కోట్లు ఆదాయం లభించింది.

తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఎక్సైజ్ ఆదాయ ప్రస్థానం ఇలా

2015-16: రూ. 12,706 కోట్లు
2017-18: రూ. 17,597 కోట్లు
2021-22: రూ. 30,783 కోట్లు
2023-24: రూ. 37,675 కోట్లు
2025-26: రూ. 40,209 కోట్లు

## సిర్సపల్లి ప్రాజెక్టుపై నిరసన జ్వాల

**ఈ నెల 3న బంద్‌కు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపు**

**డంపింగ్ యార్డుతో 30 కి.మీ మేర విష వాయువులు**

**క్యాన్సర్ ముప్పు తప్పదని హెచ్చరిక**



హైదరాబాద్, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

హుజూరాబాద్ సమీపంలోని సిర్సపల్లిలో ప్రభుత్వం ప్రతిపాదించిన వెస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టు పై నిరసన జ్వాలలు మిన్నంటుతున్నాయి. ఈ ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న హుజూరాబాద్ పట్టణ బంద్ కు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ప్రజల ఆరోగ్యం, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందని ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల వెలువడే విష వాయువులతో 20 నుంచి 30 కిలోమీటర్ల మేర గాలి, నీరు కలుషితమవుతాయని, తద్వారా శ్వాసకోస వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే హెచ్చరించారు. కనీసం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని విమర్శించారు. గాలి, నీరు కలుషితం కావడం వల్ల పశుసంపద, వృక్షాలకు తీరని నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని పాడి పశువుల పాలు, మాంసం, కూరగాయలు విషతుల్యంగా మారి ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ?పాడి పంటలతో సమృద్ధిగా ఉన్న ఈ ప్రాంత ప్రజలు, కాలుష్యం భయంతో వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం తక్షణమే ఈ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. గత పది రోజులుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రజలు శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం పై ఎమ్మెల్యే మండిపడ్డారు. గురువారం ఉదయం డంపింగ్ యార్డు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని స్వయంగా పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ఈనెల 03న నిర్వహించ తలపెట్టిన హుజూరాబాద్ బంద్ కు వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద ఎత్తున సహకరించి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు పోరాటం ఆగదని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రపంచ యవనికపై శ్రీ చైతన్య విజయకేతనం

**నాసా స్పేస్ సెటిల్‌మెంట్ పోటీల్లో వరల్డ్ ఛాంపియన్**

**అవార్డుల్లో 71శాతం వాటా ఒక్క శ్రీ చైతన్యదే**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

అమెరికాకు చెందిన నాసా ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ 2026 ఫలితాల్లో శ్రీ చైతన్య స్కూల్ మరోసారి విజయాన్ని సాధించింది. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఈ పోటీల్లో వరుసగా 15వ సారి వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచి శ్రీ చైతన్య స్కూల్ విజయ దుంధుభి మ్రోగించింది. భారతదేశం గెలిచిన అవార్డుల్లో 71 శాతం శ్రీ చైతన్యవే కావడం విశేషం. ఈ ఏడాది పోటీల వివరాలను శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సీమ వెల్లడిస్తూ, ఈ ఘనత సాధించిన ఏకైక విద్యాసంస్థ ప్రపంచంలో తమదేనన్నారు. ఈ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా మొత్తం 31 దేశాలు పాల్గొన్నాయి. మొత్తం ప్రకటించిన 134 విన్నింగ్ ప్రాజెక్టులలో భారతదేశం 80 అవార్డులను కైవసం చేసుకుంది. అందులో అత్యధికంగా 57 అవార్డులను ఒక్క శ్రీ చైతన్య విద్యార్థులే గెలుచుకోవడం విశేషం. అంటే భారతదేశం సాధించిన మొత్తం ఫలితాలలో 71 శాతం వాటా శ్రీ చైతన్యదే కావడం గమనార్హం. శ్రీ చైతన్య విద్యార్థులు సాధించిన 57 విన్నింగ్ ప్రాజెక్టులలోప్రపంచస్థాయి ఫస్ట్ ప్రైజ్6 ప్రాజెక్టులు, సెకండ్ ప్రైజ్ 11 ప్రాజెక్టులు, థర్డ్ ప్రైజ్ 10 ప్రాజెక్టులు, హనరేబుల్ మెన్షన్స్ లో 30 ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ 57 ప్రాజెక్టులలో మొత్తం 549 మందికి పైగా విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సీమ మాట్లాడుతూ ప్రపంచంలోని మిగిలిన 30 దేశాలన్నీ కలిసి మొత్తం 54 విన్నింగ్ ప్రాజెక్టులను గెలుచుకోగా, భారతదేశం నుండి ఒక్క శ్రీ చైతన్య మాత్రమే 57 ప్రాజెక్టులు సాధించడం దేశానికే గర్వకారణమని అన్నారు. అవార్డుల సంఖ్యలో గానీ, పాల్గొన్న విద్యార్థుల సంఖ్యలో గానీ తమ సంస్థ దరిదాపుల్లోకి మరే ఇతర విద్యాసంస్థ రాలేదని ఆమె పేర్కొన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు ఆమె అభినందనలు తెలియజేశారు.

## సామాన్యుడిపై 'మీసేవ' భారం

-మొదటిపేజీ తరువాయి

కుల ధ్రువీకరణ పత్రం రూ.45 నుంచి 55 ఉంగా రూ.80కి, స్థానికత ధ్రువీకరణ పత్రం రూ.45 నుంచి రూ.55 ఉండగా రూ.80కి, అదేవిధంగా జనన ధ్రువీకరణ పత్రం ప్రింట్ గతంలో రూ.40 నుంచి 45 ఉండగా రూ.62కు పెంచారు.

**విద్యార్థులు, అభ్యర్థులపై అదనపు భారం**

సాధారణంగా విద్యాసంస్థల్లో ప్రవేశాలకు, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను విధిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ మూడింటి ధరలను ఏకంగా 80 రూపాయలకు పెంచడం వల్ల మధ్యతరగతి, పేద వర్గాలపై ఆర్థిక భారం పడనుంది. మరోవైపు చాలా కాలంగా మీసేవ కేంద్రాల నిర్వాహకులు తమకు వచ్చే కమీషన్ పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పెరిగిన కరెంట్ బిల్లులు, ఇంటర్నెట్, సిబ్బంది ఖర్చుల దృష్ట్యా ఈ పెంపు అనివార్యమని వారు అభ్యర్థించారు. ఈ క్రమంలోనే ఒకేసారి 50 శాతం మేర సర్వీసు ఛార్జీలు పెంచడంపై సామాన్య ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# రేషన్ కార్డులపై సర్కార్ సర్జరీ

**ఐటీ రిటర్న్ల సాకుతో కార్డుల రద్దుకు కుట్ర... సామాన్యుడి పొట్ట కొట్టొద్దు**

**పేదలపై పైశాచిక ప్రయత్నం ఆపాలని హెచ్చరిక**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కల్వకుంట్ల కవిత ధ్వజం**

హైదరాబాద్, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

ఐటీఆర్ ఫైల్ చేసిన వారి రేషన్ కార్డులను ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తోందని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు రేషన్ కార్డుల అంశం మారిందని, గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదంటూ ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమం పెట్టుకుందని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం 5 లక్షల రేషన్ కార్డులు ఇస్తే 10 నుంచి 15 లక్షల రేషన్ కార్డులను తీసేసే ప్రయత్నం చేస్తోందని, ఐటీ రిటర్న్లు దాఖలు చేశారని, చిన్న ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారనే కారణంతో రేషన్ కార్డులు ఏరివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చిరుద్యోగులకు మేలు జరిగే రేషన్ కార్డుల ఏరివేసే పైశాచిక ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె పలు అంశాలపై స్పందించారు.

**ఉద్యోగాలు దక్కకుండా అడ్డంకులు:**

యువతకు ఉద్యోగాలు దక్కకుండా జీవోలతో ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని కవిత ఆరోపించారు. డిగ్రీ లెక్చరర్ల ఉద్యోగాలను తమవారికే ఇచ్చేలా జీవో నంబర్ 4 తీసుకొచ్చిందన్నారు. హీహెచ్?డీ?కి 25 మార్కులు వెయిటేజ్ ఇవ్వటం కూడా కుట్రలో భాగమేనన్నారు. గ్రూప్-1 లో ఏ విధంగా తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకున్నారో ఇప్పుడు అదే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి నోటిఫికేషన్?కు ఏదో ఒక జీవో అడ్డం పెట్టి నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. డీఎస్సీ కి జీవో నంబర్ 104, గ్రూప్స్




కు జీవో నంబర్ 29, పోలీసు ఉద్యోగాలకు జీవో నంబర్ 46, గురుకులాలకు జీవో నంబర్ 81 లు అడ్డంకిగా ఉన్నాయన్నారు.

**ఎత్తున పోరాటం చేస్తాం:**

వెంటనే ఈ జీవోలను రివ్యూ చేసి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరుద్యోగులను సమాయాత్తం చేసి ప్రభుత్వం పై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. నిరుద్యోగ యువతను కాంగ్రెస్ తమ రాజకీయ లబ్ధి కోసం వాడుకుందని రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ హామీ ఇచ్చి ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు చెబితే నమ్మరని రాహుల్ గాంధీతో అశోక్ నగర్?లో హామీ ఇప్పించారు. రాష్ట్రంలో 30 నుంచి 40 లక్షల కుటుంబాల్లో విద్యార్థులు పోటీ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నారు. నేను తొక్కుకుంటూ పైకి వచ్చాను అంటూ ముఖ్యమంత్రి చెబుతుంటారు. నిజంగానే నిరుద్యోగుల నెత్తి మీద కాలు పెట్టి తొక్కుకుంటూ మీరు అధికారంలోకి వచ్చారని ఎద్దేవా చేశారు. నోటిఫికేషన్లు వేసే వరకు ప్రభుత్వంతో ఫైట్ చేస్తామని ఇంతమంది నిరుద్యోగుల కన్నీటి గాథలు ఇలా ఉంటే ఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎం ఆటలు ఆడుతున్నారంటే నిరుద్యోగుల విషయంలో ఈ ప్రభుత్వం చాలా లైటర్ వే లో ఆలోచిస్తోందని అర్థమవుతోందన్నారు.

**బాలింతలకు డబ్బులు కిట్?లు బంద్ చేశారు:**

ఈ ప్రభుత్వం వచ్చాక బాలింతలకు డబ్బులు, కిట్?లు ఇవ్వటం మానేసిందని అంగన్?వాడీలకు జీతాలు కూడా సరిగా ఇవ్వటం లేదన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఏడు వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటే ఇవ్వటం లేదు. కానీ మూసీకి మాత్రం 7 వేల కోట్లు కేటాయించారని ఆరోపించారు. హామీ ఇచ్చిన విధంగా 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. 9 నెలల క్రితం పెట్టిన నర్సింగ్ ఎగ్జామ్ ఫలితాలు ఇప్పటి వరకు ఇవ్వలేదని ఇన్ని లక్షల మంది ఎఫెక్ట్ అయ్యే జీవోల మీద రివ్యూ చేసే సమయం ఈ ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు

## పారాక్వెట్ గడ్డిమందుపై "60 రోజుల నిషేధం"

-మొదటిపేజీ తరువాయి

గడ్డి మందు నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర సర్కార్ తీర్మానం చేసిన విషయం తెలిసిందే. వ్యవసాయంలో విస్తృతంగా వినియోగిస్తున్న పారాక్వాట్ డైక్లోరైడ్ 24% ఎస్ఎల్ అనే ప్రమాదకర గడ్డిమందును తక్షణమే నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సమాజ, పర్యావరణ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ఈ తీర్మానం చేసిందని స్పష్టం చేశారు. పారాక్వాట్ వినియోగం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, అనేక సందర్భాల్లో ఇది ప్రాణాంతకంగా మారుతున్నదని ఆయన పేర్కొన్నారు. క్షణికావేశంలో ఈ రసాయనం సేవించడం వల్ల జరుగుతున్న ప్రాణ నష్టాలు కూడా ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు.

ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. పారాక్వాట్ వంటి అత్యంత విషపూరిత రసాయనాల వినియోగం సుస్థిర, సహజ వ్యవసాయ విధానాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇప్పటికే యూరప్ సహా అనేక దేశాలలో పారాక్వాట్?పై నిషేధం లేదా కఠిన నియంత్రణలు అమలులో ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలో కూడా ఇలాంటి ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని అరికట్టడం అత్యవసరమని పేర్కొన్నారు. పారాక్వాట్?కు ప్రత్యామ్నాయంగా అనేక గడ్డిమందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని పారాక్వాట్ డైక్లోరైడ్ తయారీ, దిగుమతి, నిల్వ, రవాణా, విక్రయం, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని రాష్ట్ర అసెంబ్లీ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి విజజప్తి చేశారు. ఈ తీర్మానం ద్వారా రైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్య రక్షణ, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## అరవింద్ కేజ్రీవాల్‌కు హైకోర్టు నోటీసులు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్కు ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు ఢిల్లీ హైకోర్టు బుధవారంనాడు నోటీసులు పంపింది. ఎక్సైజ్ పాలసీ కేసులో సమన్లు జారీ చేసినప్పటికీ కేజ్రీవాల్ హాజరుకాలేదంటూ ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో ఆయనను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు పంపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది. ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కేజ్రీవాల్‌కు ముందుగానే నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన ఉద్దేశపూర్వకంగానే విచారణకు హాజరుకాలేదని ఈడీ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించి ట్రయల్ కోర్టు తప్పిందం చేసిందన్నారు. ఈడీ వాదనలు విన్న ధర్మాసనం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ ఈనెల 29వ తేదీకి కేసును వాయిదా వేసింది. దీనికిముందు, మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌పై విచారణకు తగిన ఆధారాలు లేవంటూ ఫిబ్రవరి 27న విచారణ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. కేజ్రీవాల్‌తో పాటు సిసోడియా, మరో 21 మందిని లిక్కర్ పాలసీ కేసులో నిర్దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ కూడా ప్రస్తుతం హైకోర్టు విచారణలో ఉంది.

## సోషల్ మీడియాపై కేంద్రం ఉక్కుపాదం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిట కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. ఏమైనా అభ్యంతరకర పోస్టులు పెడితే నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది

## ఒకే రాష్ట్రం.. ఒకే యూనిఫామ్

**విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు**

**సమానత్వ దిశగా అడుగులు**

**ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు**

**21 వస్తువులతో కూడిన మెగా స్కూల్ కిట్**

**సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):



రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పట్ల ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే కాకుండా, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాబోయే 2026-27 విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో కొత్త నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది.

**ఇక ఒకే రంగు యూనిఫామ్**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరిలో సమానత్వ భావం పెంపొందించేందుకు ప్రభుత్వం ఒకే రాష్ట్రం - ఒకే యూనిఫామ్ విధానాన్ని తీసుకురానుంది. గతంలో పాఠశాలల రకాలను బట్టి వేర్వేరు రంగులు ఉండగా, ఇకపై అన్ని స్కూళ్లలో ఒకే రంగు, డిజైన్ ఉన్న యూనిఫామ్ అమలు చేయనున్నారు. ఇది విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపును ఇవ్వడమే కాకుండా, ప్రభుత్వ పాఠశాలలకు ఓ బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకువస్తుందని విద్యాశాఖ భావిస్తోంది.

**21 వస్తువులతో కూడిన 'స్పెషల్ కిట్'**

విద్యార్థుల చదువుకు కావాల్సిన సామాగ్రి కోసం తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం 21 వస్తువులతో కూడిన భారీ స్కూల్ కిట్‌ను సిద్ధం చేస్తోంది. ఆ కిట్‌లో మూడు జతల యూనిఫామ్ క్లాత్, షూస్, రెండు జతల సాక్స్, స్కూల్ బ్యాగ్, బెల్ట్, టై, నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్, షార్ప్‌నర్, జామెట్రీ బాక్స్, డిక్షనరీ వంటి అత్యవసర వస్తువులు ఉండనున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికే విద్యార్థులందరికీ ఈ కిట్లు అందేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

# రెవెన్యూలో సరికొత్త విప్లవం

-మొదటిపేజీ తరువాయి

కిందకు తెస్తూ 'ఇంటిగ్రేటెడ్ భూ భారతి' పోర్టల్‌ను రూపొందించామన్నారు. ఈ పోర్టల్‌ను నేటి నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ వివాదాల పరిష్కారానికి ఇది తొలి అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు, చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. కేరళ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి, బుధవారం నాడు పోర్టల్ ప్రారంభానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని, సామాన్య రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం నుంచి ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఈ పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**లైసెన్స్‌డ్ సర్వేయర్‌తోనే సర్వే**

గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీ–సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేకుండా, ఇంటి నుంచే భూ సేవలు పొందే విధంగా పోర్టల్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. రైతులు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఇప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి నుంచే 'భూ భారతి' పోర్టల్ ద్వారా సేవలు పొందవచ్చన్నారు. రైతు లాగిన్ అయిన వెంటనే తనకున్న భూమి వివరాలు కనిపిస్తాయి. ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే, అందుకు సంబంధించిన ఫీజు ఎంత చెల్లించాలో చూపిస్తుంది. ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళ్తాయి. ఆ తర్వాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారు. అనంతరం ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమే కాకుండా, సర్వేను రోవర్లతో పూర్తి చేస్తారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక, అది మండల సర్వేయర్ స్క్రూటినీకి వెళ్తుంది. ఆపై మండల తహశీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారైన రైతుకు ఎల్‌పీఎం, భూధార్ నంబర్లు కేటాయిస్తారు. ఈ వివరాలన్నీ భూ భారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయి. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్‌ను జనరేట్ చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ అలర్ట్స్ వస్తాయని మంత్రి వివరించారు.

**సర్వే మ్యాప్ తప్పనిసరి**

భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయదారులకు ఇబ్బంది లేకుండా, రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్‌కు (ఎల్‌పీఎం) యూనిక్ నంబర్, ప్రతి సర్వే నంబరుకు భూధార్ నంబరు కూడా ఇస్తామన్నారు. సర్వే నిర్వహించడానికి అవసరమైన సర్వేయర్లను అందుబాటులో ఉంచామని, గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత పరికరాలకు స్వస్తి చెప్పి రోవర్లతో సర్వే నిర్వహిస్తామన్నారు. దీనివల్ల సర్వే ప్రక్రియ త్వరగా పూర్తి కావడమే కాకుండా, కచ్చితమైన వివరాలు వస్తాయని తెలిపారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ఒక కీలకమైన ముందడుగు అని మంత్రి స్పష్టం చేశారు.

# ఇది 'బీజేపీ లూట్ దివస్'

దేశంలో ఈరోజు నుంచి చాలా నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ఇది బీజేపీ లూట్ దివస్ అని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. భారత్ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు సర్వ నాశనం చేయబట్టే ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఈ సంక్షోభ కాలంలో దేశంలోని సామాన్యులు ఊరట కోసం ఎదురు చూస్తుంటే, బీజేపీ సర్కారు మాత్రం ప్రజలను లూటీ చేయడంపై, దేశాన్ని దోపిడీ చేయడంపై పూర్తి ఫోకస్ పెట్టిందని ఆయన మండిపడ్డారు. ఈమేరకు బుధవారం రోజు ఖర్గే ఒక ట్వీట్ చేశారు. "దేశ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు నాశనం చేసిన పర్యవసానాన్ని ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయులు భరిస్తున్నారు. ఈరోజు నుంచి పలు నిత్యావసరాలు, 900కుపైగా ఔషధాల ధరలు పెరగబోతున్నాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్య సంరక్షణ వ్యయాలు చుక్కలను అంటుతున్నాయి. గుండె జబ్బులు ఉన్న రోగులకు అమర్చే కరోనరీ స్టంట్ల ధరలూ పెరిగాయి. వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలు రాకెట్ వేగంతో పెరుగుతున్నాయి. ఈ సిలిండర్ల సప్లై దారుణంగా తగ్గిపోయింది. దీంతో టీ రేటు, రోడ్డుపక్కన అమ్మే తినుబండారాల రేట్లు కూడా పెరిగిపోయాయి. ప్రత్యేకించి ప్రభుత్వ స్కూళ్లలో అమలుచేసే మధ్యాహ్న భోజన పథకంపైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. విమాన ఇంధనం ధర మరింత ప్రియం అవుతోంది. ఒకప్పుడు సామాన్య పౌరులూ విమానాల్లో ప్రయాణించేవారు. ఇప్పుడు విమాన ప్రయాణం అనేది ఖరీదైన విషయంగా మారిపోయింది. సాక్షాత్తూ ప్రభుత్వమే విమాన టికెట్ల ధరలపై పరిమితిని



ఎత్తేసింది. బిట్యుమెన్ ధరలూ 50 శాతం పెరిగాయి. ప్రజలు ఇప్పుడు మరింత ఎక్కువ టోల్ ట్యాక్స్‌ను చెల్లించాల్సి వస్తోంది. ఇది హైవేలపై దారుణమైన దోపిడీలా మారిపోయింది. స్పీడ్ పోస్ట్ ఛార్జీ సైతం 34 శాతం పెరిగింది. ప్లాస్టిక్ వస్తువులు, స్టీల్, సిరామిక్స్, రైతులు వినియోగించే పీవీసీ పైపుల ధరలూ పెరిగాయి. దేశ నిర్మాణ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది" అని ట్వీట్‌లో ఖర్గే ప్రస్తావించారు.

**లోక్‌సభ సీట్ల పెంపుతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం : కాంగ్రెస్**

లోక్‌సభ సీట్ల సంఖ్యను 50 శాతం పెంచే బిల్లును బలవంతంగా ఆమోదింపజేయాలని మోదీ సర్కారు భావిస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. దీనివల్ల దక్షిణ, ఈశాన్య, పశ్చిమ భారత్‌లలోని చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని ఆయన తెలిపారు. ఒకవేళ ఆ ప్రతిపాదిత బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభిస్తే, ప్రతీ రాష్ట్రంలోనూ లోక్‌సభ సీట్లు 50 శాతం మేర పెరుగుతాయన్నారు. దీనిపై ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారని, ఆ బిల్లుపై అధికారిక ప్రకటన వెలువడ్డాక మరిన్ని రాష్ట్రాలూ వ్యతిరేకించే అవకాశం ఉంటుందని జైరాం రమేశ్ చెప్పారు. అన్ని రాష్ట్రాల్లో సరిసమానంగా 50 శాతం చొప్పున లోక్‌సభ సీట్లను పెంచితే, దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. ఈవిషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్యనున్న గ్యాప్ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

**రాష్ట్ర అసెంబ్లీల సీట్లనూ 50 శాతం పెంచే ప్లాన్**

"ఉదాహరణకు ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 80 లోక్‌సభ సీట్లు, తమిళనాడులో 39 సీట్లు ఉన్నాయి. కానీ ప్రతిపాదిత బిల్లు ప్రకారం యూపీలో సీట్ల సంఖ్య 120కి పెరుగుతుంది. ఇక ఇదే సమయంలో తమిళనాడులోని సీట్లు 59కే పరిమితం అవుతాయి. కేరళలో 20 నుంచి 30కి, బిహార్‌లో 40 నుంచి 60కి సీట్లు పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య 66కు, ఉత్తరాది రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య 200కు చేరుతుంది. దీనివల్ల తాత్కాలికంగా లోక్‌సభ సీట్ల నిష్పత్తి మారకపోవచ్చు. కానీ దీర్ఘకాలంలో చాలా ప్రతికూల పరిణామాలు కనిపిస్తాయి. ఇలాంటి బిల్లును మోదీ సర్కారు ఏకపక్షంగా తయారు చేయడం సరికాదు. చివరకు రాష్ట్ర అసెంబ్లీల సీట్లనూ 50 శాతం పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనిపైనా కూలంకశమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది" అని జైరాం రమేశ్ తెలిపారు.

# తమిళనాడులో కుల, మత హింసలేవీ లేవు

బీజేపీపై తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లాగా తమిళనాడులో కుల ఘర్షణలు, మత అల్లర్లు లాంటివి లేవని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే తమిళనాడులో శాంతి, భద్రత మెరుగ్గా ఉందన్నారు. బుధవారం తిరుచిరాపల్లి జిల్లాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ' 'ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్న మూక దాడులు, మణిపుర్‌లో కొనసాగుతున్న అశాంతి తమిళనాడులో లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కనిపించే పరిస్థితులు ఇక్కడ లేవు. బీజేపీ సృష్టించాలనుకున్న కుట్రలను కూడా మేం అడ్డుకున్నాం. మా ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఏర్పడింది.అందువల్ల పెట్టుబడులు స్థిరంగా పెరుగుతున్నాయి. దీనికి మద్దతుగా మేం ఎన్నికల ప్రణాళిక, మేనిఫెస్టో విడుదల చేశాం. ప్రకటించిన ప్రతి హామీని అమలు చేస్తాం. మేం చెప్పింది చేస్తాం, చేసినదే చెబుతాం. నేను కరుణానిధి కుమారుడిని' అని స్టాలిన్ తెలిపారు.

**అన్నాడీఎంకే, బీజేపీపై విమర్శలు**

గతంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న అన్నాడీఎంకే పాలనలో రాష్ట్రం వెనుకబాటుకు వెళ్లిందని విమర్శించారు. ఎడిప్పాడి కే పళనిస్వామి ప్రభుత్వం తన బంధువులకు కాంట్రాక్టులు ఇవ్వడానికే పనిచేసిందని ఆరోపించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తమిళనాడుకు సరైన నిధులు ఇవ్వలేదని అన్నారు. తిరుచిరాపల్లి జిల్లాలో గత ఐదేళ్లలో రూ.26,000 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అమలు చేశామని స్టాలిన్ తెలిపారు. మహిళల హక్కుల భృతి పథకం ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పారు. విద్యార్థులకు అల్పాహార పథకం, నాన్ ముదల్వన్ వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో తిరుచిరాపల్లిలో క్లీన్ స్వీప్ సాధించినట్లు గుర్తుచేస్తూ, ఈసారి కూడా అదే విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు.



**పళనిస్వామిని అన్ని నియోజకవర్గాల్లో ఓడించాలి : ఉదయనిధి స్టాలిన్**

అటు తమిళనాడు ఉప ముఖ్యమంత్రి కూడా ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిపక్షంపై విమర్శలు గుప్పించారు. అన్నాడీఎంకే నేత ఎడప్పాడి కే పళనిస్వామిని అన్ని నియోజకవర్గాల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఉదయనిధి తెలిపారు. మహిళలకు నెలకు రూ.1000 ఆర్థిక సాయం ఇప్పటికే అమల్లో ఉందని, తిరిగి అధికారంలోకి వస్తే దాన్ని రూ.2000కు పెంచుతామని చెప్పారు.

**విద్యార్థులకు పథకాల విస్తరణ**

ప్రస్తుతం 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు అందిస్తున్న అల్పాహార పథకాన్ని 8వ తరగతి వరకు విస్తరిస్తామని తెలిపారు. అదనంగా, గృహోపకరణాల కొనుగోలుకు రూ.8000 విలువైన కూపన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. విపక్ష విమర్శలకు సమాధానంగా, గతంలో పాఠశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇచ్చామని, ఇప్పుడు 10 లక్షల కాలేజీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించామని పేర్కొన్నారు

**తమిళనాడు రాజకీయాలు**

కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న ఒకే దశలో జరగనున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది. ఈ ఎన్నికల్లో డీఎంకే మొత్తం 234 స్థానాల్లో 164 స్థానాలకు గానూ పోటీ చేయనుంది. మిగిలిన 70 స్థానాలను మిత్రపక్షాలకు కేటాయించింది. అయితే, ఎన్నికల సమయం దగ్గర పడుతున్నకొద్దీ గెలుపే లక్ష్యంగా అధికార, విపక్షాలు పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి ప్రచారం జోరుగా సాగుతోంది. రాజకీయ పార్టీల మధ్య విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరిపై ఒకరు విమర్శలు వర్షం కురిపిస్తున్నారు. అధికార డీఎంకే మరోసారి తమ పార్టీని నిలబెట్టుకోవాలని యోచిస్తోంది. ఈ ఎన్నికల్లో అధికార డీఎంకేను ఢీకొట్టేందుకు, అన్నా డీఎంకే, బీజేపీ సారథ్యంలోని విపక్ష కూటమి సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి ఒంటరిగా బరిలోకి దిగారు.

## పల్లెలకు జాతీయ అవార్డుల పంట

**గ్రామీణాభివృద్ధిలో మరోసారి సత్తా చాటిన రాష్ట్రం**

**రెండు విభాగాల్లో జాతీయ పురస్కారాలు**

**గ్రామ ప్రతినిధులకు మంత్రి సీతక్క అభినందనలు**




తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన ప్రతిష్టాత్మక దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు లో రాష్ట్రానికి చెందిన రెండు గ్రామ పంచాయతీలు జాతీయ అవార్డులను దక్కించుకున్నాయి. గుడ్ ఫర్ గవర్నెన్స్ విభాగంలో వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలం మోతుకుపల్లి గ్రామ పంచాయతీ పురస్కారం దక్కించుకుంది. గ్రామ స్థాయిలో పారదర్శక పరిపాలన, ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన ప్రతిభకు గుర్తింపు లభించింది. అలాగే సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో జాతీయ అవార్డుకు ఎంపికైంది. మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన కృషికి గాను ఈ అవార్డు దక్కింది.

**సీతక్క అభినందనలు:**

దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్న పంచాయతీలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఈ నేపథ్యంలో రెండు విభాగాల్లో తెలంగాణకు అవార్డులు రావడం పట్ల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం గర్వకారణం. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన, మహిళా సాధికారత దిశగా మా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనం అన్నారు. అవార్డులు అందుకున్న మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బందిని అభినందిస్తున్నాను. ఇలాంటి విజయాలు ఇతర పంచాయతీలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.

## మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట

-మొదటిపేజీ తరువాయి

అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టార్గెట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

## విమాన ఇంధన ధరలు పాక్షికంగా పెంపు

దేశీయ విమాన ప్రయాణికులపై భారాన్ని తగ్గించేందుకు విమాన ఇంధన ధరలను పాక్షికంగానే పెంచేందుకు అనుమతించామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశీయ విమానయాన సంస్థలకు విమాన ఇంధన ధరల పెరుగుదలను 25 శాతానికే పరిమితం చేశామని తెలిపింది. బుధవారం కేంద్ర మంత్రిత్వ శాఖల సంయుక్త మీడియా సమావేశంలో పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి అసంగ్బ చౌబా ఈవివరాలను చెప్పారు. దేశీయ విమానయాన సర్వీసుల నిర్వహణ వ్యయాలు పెరగకుండా నిలువరించేందుకే ఈ చర్యను చేపట్టామన్నారు. సామాన్యులకూ విమాన సర్వీసులను అందుబాటులో ఉంచాలని, సరుకు రవాణా సాఫీగా సాగాలని ప్రభుత్వం కోరుకుంటోందని ఆయన తెలిపారు.

**భారత్‌కు వచ్చే 2 నెలలకు సరిపడా చమురు సప్లైలు : కేంద్రం**

భారత్‌కు వచ్చే 2 నెలలకు సరిపడా ముడి చమురు సప్లైలు ఉన్నాయని పెట్రోలియం, సహజ వాయువు శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. భారత చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) అన్నీ గరిష్ఠ కెపాసిటీతో పని చేస్తున్నాయని, దేశంలోని పెట్రోలు బంకుల్లో స్టాక్ అయిపోవడం అనేది ఎక్కడా జరగలేదని ఆమె తెలిపారు. 2 నెలల క్రితం 1 బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 70 డాలర్లేనని, ఇప్పుడా రేటు 100 డాలర్లు దాటిందని సుజాత శర్మ గుర్తుచేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో భారీగా ముడి చమురు ధర పెరిగినా, దేశంలో పెట్రోలు, డీజిల్ ధరలను ప్రభుత్వం పెంచలేదన్నారు. 2022 ఏప్రిల్ 6 నుంచి ఒక్కసారి కూడా పెట్రోలు, డీజిల్ ధరలను పెంచకపోగా, 2024 మార్చిలో వాటి రేట్లను రూ.2 మేర తగ్గించారని ఆమె పేర్కొన్నారు. ఆ తగ్గిన రేట్లే ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల ఎఫెక్ట్ భారత ప్రజలపై పడకుండా చూసేందుకు ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు. పెట్రోలు, డీజిల్ విక్రయాలపై చమురు మార్కెటింగ్ కంపెనీలకు జరుగుతున్న నష్టాన్ని కేంద్ర సర్కారే భరిస్తోందని సుజాత శర్మ పేర్కొన్నారు.

## 'ఎన్నికల ప్రచారంలో భద్రతా లోపాలు'

తన ఎన్నికల ప్రచారంలో భద్రతా లోపాలు జరిగాయంటూ టీవీకే అధినేత, దళపతి విజయ్ ఆరోపించారు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, హోం శాఖ కార్యదర్శికి లేఖలు రాశారు. ఇది ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో సంచనలంగా మారింది. సోమవారం నామినేషన్ వేసిన అనంతరం పెరంబూర్ నుంచి కొళత్తూర్‌కు వెళ్లే మార్గంలో జరిగిన ఉదంతం గురించి ఆయన లేఖలో వివరించారు. తన కాన్వాయ్ వెళ్లే మార్గంలో పోలీసు భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ సరిగ్గా లేకపోవడం, ఫలితంగా తాను ప్రయాణించే కాన్వాయ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడం వంటి విషయాల గురించి లేఖలో ప్రస్తావించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తనకు్ కేటగిరీ భద్రతా కేటాయించిందని విజయ్ గుర్తు చేశారు. అయితే, ప్రోటోకాల్ ప్రకారమే తన ప్రయాణాన్ని కొనసాగించానని ఆయన తెలిపారు. అలాగే, తన ప్రచారానికి అవసరమైన అన్ని అనుమతులు పొందిన తర్వాతే ప్రచారంలో పాల్గొన్నానని చెప్పుకొచ్చారు. పెరంబూర్‌లో ప్రచారం అనంతరం, కొళత్తూరు నియోజకవర్గంలోని తదుపరి ప్రచార వేదికకు బయలుదేరానని, ఆ సమయంలో తగినంత భద్రతా ఏర్పాటు లేకపోవడం వల్ల కాన్వాయ్?కు తీవ్ర అంతరాయం ఏర్పడిందని విజయ్ చెప్పుకొచ్చారు.

తీన్మార్

# నక్సలిజం తెరమరుగైనదా?

పోలీసు పతాక దినోత్సవం పోలీసుల త్యాగాలను స్మరించు కోవడానికి, వారి సేవలను గౌరవించడానికి ఒక ముఖ్యమైన రోజు. శాంతి భద్రతలను పరిరక్షించడంలో, నేరాలను నియంత్రించడంలో, ప్రజలను రక్షించడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తారు. ఈ క్రమంలో వారు అనేక సార్లు తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతుంటారు. పోలీసు పతాక దినోత్సవం వారి ధైర్యసాహసాలకు, నిస్వార్థ సేవకు గుర్తుగా నిలుస్తుంది. నాటి కమ్యూనిస్టుల, రజాకార్ల కార్యకలాపాలకు అనంతర పీపుల్స్ వార్ ఉద్యమానికి కేంద్ర బిందువై, విప్లవాల పురిటి గడ్డగా పేరెన్నిక గని, రైతు కూలీల సంఘాల స్థాపనకు అజ్ఞాత తీవ్రవాద ఉద్యమానికి ఊపిరులూది, పీపుల్స్ వార్ వ్యవస్థాపక భాగస్వామ్య నేత, మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి ముప్పాళ లక్ష్మణ్ రావు అలియాస్ 'గణపతి' జన్మస్థలమైన జగిత్యాల జిల్లాలో గత దాదాపు రెండు దశాబ్దాలుగా 'వార్' కార్యకలాపాలు తెర మరుగైనాయి. పోరాటాల పురిటి గడ్డపై భూమికోసం, భుక్తికోసం, విముక్తి కోసం దున్నే వాడిదే భూమి నినాదంతో ప్రారంభించి, రైతు కూలీ సంఘాల స్థాపన ద్వారా వేళ్ళూనుకుని, 1977లో జగిత్యాల జైత్ర యాత్ర పేరున కాగడాల ప్రదర్శన ద్వారా బల ప్రదర్శన గావించి, పలు సమస్యలపై పోరాటాలను నిర్వహించడం ద్వారా ప్రజల మద్దతును కూడగట్టుకుని, తన నిరాటంక కార్యకలాపాలను విస్తరించుకున్న పీపుల్స్ వార్ కార్యకలాపాలు ఈ ప్రాంతంలో క్రమేపీ పూర్తిగా కను మరుగైనాయి. నిరంతర వ్యూహాలు, ఎత్తుగడలు, ఎత్తుకు పై ఎత్తులతో పీపుల్స్ వార్ పోలీసుల ఆధిపత్య పోరులో 'వార్' ఉద్యమ చరిత్రలో ఏనాడూ లేని విధంగా నాటి సిఎం రాజశేఖర రెడ్డి హయాంలో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొని జగిత్యాల జిల్లాలో ఉనికిని కోల్పోయింది. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా, సాయుధ పోరాటమే ధ్యేయంగా, రాష్ట్రం లోనే ప్రప్రథమంగా 1985 జూలై 23న సాయుధ కానిస్టేబుల్ కోమల్ రెడ్డిని ధర్మపురి క్షేత్ర నడి బొడ్డున ప్రజల సంచారం మధ్యన కాల్చి చంపి, బీర్పూర్ లో వంగపెల్లి తిరుపతి రావును హతమార్చి, నాటి జగిత్యాల డీఎస్పీ వేణు గోపాల కృష్ణ, సీఐ నర్సింగ్ రావు పోలీసు ఉన్నతాధికారుల రాకను ఊహించి, 1989 సెప్టెంబర్ 13న మందు పాతరలను పేల్చి 18 మంది అమాయకుల మృతికి కారణమై పోలీసులే లక్ష్యంగా, పోలీసు వ్యవస్థకు సవాలు విసిరిన పీపుల్స్ వార్, ఎన్ కౌంటర్లు, అరెస్టులు, లొంగుబాట్లు, అంతర్గత సమస్యలు, సమన్వయ రాహిత్య కారణాలుగా ఈ ప్రాంతం నుండి కాలక్రమేణ నిష్క్ర మించింది. ముఖ్యంగా కొంతకాలం పాటు అడ్డూ అదుపూ లేకుండా, ఈ ప్రాంతంలోని పలు మండలాల లోని గ్రామాలపై గట్టి పట్టు కలిగి, పలు హత్యలు, దహనాలు, దగ్గాలు, కరవు దాడులలాంటి అనేక హింసాత్మక సంఘటనలకు పాల్పడి, తమ ఆధిపత్యాన్ని చాటి చెపుతూ, పోలీసులకు పెను సవాలుగా మారిన అరికెల్ల శంకర్ అలియాస్ 'భూపతి' నేతృత్వం లోని మల్యాల దళం 1990 ఆగస్టు 19న మల్లన్నపేట వద్ద జరిగిన భారీ ఎన్ కౌంటర్లో దళ డెప్యూటి కమాండర్ మరాఠా రవి, భూపతి భార్య లక్ష్మి, విలాసాగర్ విజయలక్ష్మి, సూర్యం, భారతక్క, సంధ్య, రాజయ్య అనే ఆరుగురు దళ సభ్యులను ఏకకాలంలో పోగొట్టు కోవడం ద్వారా వార్ కార్యకలాపాలు కనుమరుగు కాగా, 2000 సెప్టెంబర్ 20న మంథని, ముత్తారం ప్రాంతంలోని దుబ్బలపాడు వద్ద పోలీసుల చేతిలో అరికెల్ల శంకర్ అలియాస్ భూపతి మృతి చెందడంతో మల్యాల దళం శకం ముగిసింది. అనంతర పరిణామాలలో అనూహ్యంగా 2002 జూలై 2వ తేదీన ధర్మపురి మండలంలోని నేరేళ్ల గ్రామ శివారులోని సంకెన బోరు గుట్టపై, కరుడు కట్టిన తీవ్రవాది, పోలీసులకు సింహ స్వప్నంగా మారిన కరీంనగర్ పశ్చిమ డివిజన్ కార్యదర్శి, ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటి సభ్యురాలు న్యాలకొండ రజిత అలియాస్ 'పద్మక్క' తో బాటు లక్ష్యాన్ని ఛేదించడంలో గురి తప్పని నేర్పరిగా భావించ బడిన సాగర్, విక్రం, మానసలు పోలీసు కాల్పులలో అసువులు బాయడం వార్ కు అశని పాతమైంది. ఆ తరువాత నాటి జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అనుసరించిన కఠిన వైఖరి మూలంగా, నిత్య నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, పీపుల్స్ వార్ జగిత్యాల ఏరియా కమిటీ కార్యదర్శి గిరి రవీందర్ అలియాస్ 'జనార్ధన్' ఎదురు కాల్పుల మృతితో ఈప్రాంతంలో 'వార్' కార్యకలాపాలు అడ్డుకట్ట పడింది. ప్రప్రథమంగా పీపుల్స్ వార్ చేతిలో ధర్మపురి క్షేత్రంలో కాల్చి చంపబడిన సాయుధ కానిస్టే కోమల్ రెడ్డి, బట్టపెల్లి – పోతారం మధ్య పాతరలో ప్రాణాలను కోల్పోయిన పోలీసులు శ్రీనివాస్, ప్రకాశ్, రాజయ్యలతో పాటు ధర్మపురి ప్రాంతంలో వార్ నక్సల్స్ చేతిలో హతమైన జోగినిపెల్లి వసంతరావు, కొండపల్లి జగన్నాథ రావు, పెద్దనవేని రాయమల్లు, రాగయ్య, బసవరాజు అంజయ్య, మహేశ్, ఉమాపతిరావు రామడుగు జనార్ధన్రా రావు, మూల సత్తయ్య, ఫహీం, సుంకసాని జలందర్ రావు, సుద్దాల వెంకటి, పొనగంటి ప్రభాకర్, షేక్ మహబూబ్ అలీ, కొండపెల్లి వాసుదేవరావు, బొడ్డు శంకరయ్య, గొల్లపెల్లి మండలంలో కందుకూరి శంకరయ్య, మూల జగన్, పబ్బనవేని రాజ కటారి సత్యనారాయణరావు, ముదాం ఆది రెడ్డి, మరియు సారంగాపూర్ మండల వాస్తవ్యు లైన గంగాధర సుధాకర్ రెడ్డి, నలిమల మల్లయ్య, లెక్కల గంగారెడ్డి, మడిగెల మాధవ రెడ్డి, వేల దేవరావు, అన్నమనేని మనోహర్రావు, కంకణ బాలయ్య, రామడుగు నర్సింగరావు, చంద్రశేఖర్రావు, బాలె చిరంజీవి, సబ్బ నర్సయ్య, నూతులు రాఘవరెడ్డి, పడిగల మాధవరెడ్డి, ఎడమల మాధవరెడ్డి, కల్లెం వెంకటరెడ్డి, ఓల్లాల భూమయ్య తదితరులు తీవ్ర వాదుల చేతుల్లో ఆయువు తీరకమున్నే అస్తమించారు.

# వైభవం మహలక్ష్మి రథోత్సవం

కొల్హాపూర్ మహలక్ష్మి రథోత్సవం ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో చైత్ర పౌర్ణమి రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. ఈ ఏడు ఏప్రిల్ 2వ తేదీన గురువారం లక్ష్మి దేవి మూర్తిని కలిగి ఉన్న రథాన్ని రాత్రి 7:30 నుండి ఊరేగింపుగా తీసుకు వెళతారు.. ఈ సందర్భంగా వెండి రథాన్ని ప్రత్యేక దీపాలు, పూలతో అలంకరించారు. హిందూ సాంప్రదాయంలో లక్ష్మీదేవిని పూజించడం సర్వత్రా కనిపించే దయినా, అనునిత్యం పూజలందుకునే శ్రీమహలక్ష్మికి మన దేశంలో విడిగా వున్న ఆలయాలు తక్కువే. లక్ష్మీదేవికి ప్రత్యేకించి వున్న ఆలయాలలో కొల్హాపూర్ ఆలయం ముఖ్యమయినది. ఈ ఆలయం మహారాష్ట్రలోని కొల్హాపూర్ లో పంచగంగ నది ఒడ్డున బెంగళూరు మరియు పూణే మధ్య జాతీయ రహదారిపై ఉంది. ఇది అమ్మవారి అష్టాదశ శక్తి పీఠాలలో ఏడవది. స్కాంద పురాణం, దేవీ భాగవతాలలోఈ క్షేత్రాన్ని కరవీర నగరమని, దేవిని కరవీర మహలక్ష్మి అని ప్రస్తుతించారు. పరమశివుడికి కాశీ ఎలా అవిముక్త క్షేత్రమో, శ్రీ మహావిష్ణువుకి, లక్ష్మీదేవికి ఇది అవిముక్త క్షేత్రం. వారీ క్షేత్రాన్ని ఎప్పుడూ విడవకుండా వుంటారు. అగస్త్య మహాముని అచంచల శివభక్తుడు. ఏటా కాశీ వెళ్లి విశ్వనాథుణ్ణి దర్శించుకునేవాడు. వృద్ధాప్యంలో అగస్త్యుడికి సుదూరంలో ఉన్న కాశీనగరాన్ని దర్శించుకోవడం కష్టమనిపించి, శివుడి గురించి తపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై, వరం కోరుకోమన్నాడు. అగస్త్యుడు తాను వయోభారంతో ఏటా కాశీలో ఉన్న విశ్వనాథుణ్ణి దర్శించుకోలేక పోతున్నానని, కాశీకి ప్రత్యామ్నాయంగా తనకో క్షేత్రాన్ని చూపిస్తే, అక్కడే తాను శివుణ్ణి దర్శిస్తానని కోరాడు. కాశీతో సమానమైన ప్రాశస్త్యం గల నగరం కొల్హాపురమని, అక్కడ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు కొలువై ఉన్న క్షేత్ర సందర్శనం తనను కాశీలో దర్శించుకున్నంత పుణ్యఫలాల నిస్తుందని చెప్పాడట. శివుని ఆనతిమేరకు అగస్త్యుడు కొల్హాపూర్‌లో మహాలక్ష్మిని, అతిబలేశ్వం స్వామిని దర్శించి పునీతుడయ్యాడని ఇక్కడి స్థలపురాణాల ద్వారా స్పష్టం అవుతున్నది. ప్రళయకాలంలో శివుడు తన త్రిశూలంతో కాశీ పట్టణాన్ని ఎత్తి రక్షించినట్లు, మహాలక్ష్మి ఈ క్షేత్రాన్ని తన కరములతో ఎత్తి రక్షించింది. అందుకే ఆమె కరవీర మహాలక్ష్మి అయింది అంటారు. భృగు మహర్షి చేసిన అవమానాన్ని తట్టుకోలేని మహాలక్ష్మి వైకుంఠాన్ని విడిచి సహ్యాద్రి పర్వత ప్రాంతంలోని కొల్హాపూర్‌లో వెలిశారని ఒక కథ. శంకరాచార్యులవారు ఈ ఆలయాన్ని దర్శించి ఇక్కడ శ్రీ చక్రాన్ని స్థాపించారు. తర్వాత విద్యాశంకర భారతి ఈ క్షేత్ర వైశిష్ట్యాన్ని గుర్తించి ఇక్కడ ఒక మఠం నిర్మించారు. దత్తాత్రేయుడు ప్రతి రోజూ మధ్యాహ్నం ఇక్కడ భిక్ష చేస్తారని ప్రతీతి. దానికి చిహ్నంగా ఇక్కడ



ఆయనకి ఉపాలయం వున్నది. షుమారు 6 వేల సంవత్సరాల క్రితం ఆలయంగా భావిస్తారు. తర్వాత అనేక రాజుల సమయాలలో అభివృద్ధి చెందిన ఈ మందిరం విశాల ప్రాంగణంలో హేమాడ్ పంత్ శైలిలో, శిల్పకళా నైపుణ్యంతో నిర్మింప బడింది. 7 వ శతాబ్దం లోని ఈ దేవాలయాన్ని చాళుక్య వంశ రాజైన కరన్దేవ్ తిరిగి చాలాకాలం తరువాత దీని నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పవిత్ర స్థల నిర్మాణ శైలి హేమండ్ పతి ప్రేరణతో చేయబడింది. ఈ ఆలయాన్ని యాదవ వంశీయులు 8 వ శతాబ్దంలో మరింత అందంగా తీర్చిదిద్దారని చెపుతారు. ఈ నగరాన్ని కోల్‌పూర్ అని కోల్‌గిరి అని, కొలదిగిరి పట్టణ్ అని పిలిచేవారు. 'కొల్లా' అంటే 'లోయ'అని, 'పూర్' అంటే పట్టణమనే అర్థంలో ఈ క్షేత్రం విలసిల్లిందని చెబుతారు. కొల్హాపూర్ క్షేత్రాన్ని 1359వ సంవత్సరం వరకు శివాజీ మహారాజు పూర్వికులు పాలించగా, 17వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ ఏలుబడిలో దినదిన ప్రవర్ధమానమైందని తెలుస్తోంది. నాలుగు దిక్కులా ముఖ ద్వారాలు కలిగి ఆలయం 5 గోపురాలకింద వుంటుంది. మధ్యలో ఒక గోపురం, నాలుగు దిక్కులా నాలుగు గోపురాలు. తూర్పు గోపురం కింద మహలక్ష్మి, మధ్య కుమార మండపం, పడమర గణపతి, ఉత్తర దక్షిణ గోపురాల కింద మహాకాళి, మహా సరస్వతి కొలువుతీరి వున్నారు. ఉపాలయాలలో వెంకటేశ్వరస్వామి, నవగ్రహాలు, రాధాకృష్ణ, కాలభైరవ, వినాయకుడు, సింహవాహిని, తుల్జాభవాని వగైరా అనేక దేవీ దేవతలున్నారు. గర్భగుడిలో అమ్మవారి విగ్రహం సుమారు ఆరడుగుల చదరంగా ఉన్న ఎత్తైన వేదిక మీద రెండడుగుల పీఠం, దానిమీద మహాలక్ష్మి కూర్చొని ఉన్న భంగిమలో ఉంటుంది. చతుర్భుజి. నాలుగు చేతులలో పండు, గద, డాలు, పానపాత్ర ధరించి వుంటుంది మూడడుగుల ఎత్తున్న మూర్తి, అనేక ఆభరణాలతో సుసజ్జిత. చాలా అందంగా ఆకర్షణీయంగా ఉంటుంది. వెనుక సింహ వాహనము కనబడుతుంది. మూలవిరాట్ పడమటి ముఖంగా వుంటుంది. ఇక్కడ సూర్యకిరణాలు ప్రతిరోజూ దేవతా విగ్రహానికి బంగారు సొగసులు అందిస్తూ తాకే విధంగా ఈ ఆలయం నిర్మించబడింది. సంవత్సరానికి 2, 3 సార్లు...సూర్యాస్తమయం అయినపుడు సూర్యుని కిరణాలు ఈ కిటికీ గుండా ప్రతి సంవత్సరం 21 మార్చి, 21 సెప్టెంబరు లలో మూడు రోజులపాటు విగ్రహంపై పడతాయి. పడమటి దిక్కులోగల చిన్న కిటికీగుండా అమ్మవారి ముఖాన్ని తాకుతాయి. ఈ ప్రత్యేక దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. గర్భగుడి గోడపై శ్రీచక్రం వుండటం ఇక్కడ ప్రత్యేకం...మొదట ఒక్క మహాలక్ష్మినే ప్రతిష్టించారు. తర్వాత 11వ శతాబ్దంలో గండరాదిత్య హయాంలో మరమ్మత్తులు, ప్రదక్షిణబాట, మహాకాళీ, మహాసరస్వతి ప్రతిష్ట జరిగాయి. మూలవిరాట్ కి మహాకాళికి మధ్య మహలక్ష్మి యంత్రం స్థాపించ బడింది. దీనిపైన గాజుపలక వుండటంతో భక్తులు దర్శించుకోవటానికి వీలుగా వుంటుంది. మహారాష్ట్రీయులకు కొల్హాపూర్ మహాలక్ష్మి అత్యంత పవిత్ర యాత్రాస్థలం. వీరు అమ్మవారిని 'అంబాబాయి' అని పిలుస్తారు. అమ్మవారికి రోజూ అయిదు సార్లు అర్చన జరుగుతుంది. ఉదయం అయిదు గంటలకు శ్రీ మహా లక్ష్మీ దేవికి సుప్రభాత సేవ చేస్తారు. కాకడ హారతి ఇస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు షోడశోపచార పూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం, సాయంత్రాలలో పూజ, శేజ్ హారతి జరుపుతారు. అమ్మవారికి ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చైత్రమాసంలో వచ్చే పౌర్ణమితో పాటుగా నవరాత్రులపుడు అమ్మవారికి వేడుకలు జరుపుతారు. ప్రతి శుక్రవారం సాయంత్రాలలో, పౌర్ణమి నాడు, అమ్మవారిని ఆలయం వెలుపల ఊరేగిస్తారు.

# బహు ప్రత్యేకతల సమాహారం ఒంటిమిట్ట కోదండ రామాలయం

దుష్టశిక్షణ కోసం, శిష్ట రక్షణ కొరకు శ్రీ మహా విష్ణువు యుగయుగాలలో అవతరిస్తూ ఉంటాడు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడుగా అవతరించి దండ కారణ్యంలో సీతాలక్ష్మణ సమేతుడై సంచరించాడు. సీతాదేవి దప్పిక తీర్చడానికి భూమిలోనికి బాణం వేయగా నీటి బుగ్గ పుట్టింది. అదే ఒంటిమిట్టలోని రామతీర్థం అయింది. సీతాన్వేషణ కోసం, రావణ సంహారం కోసం శ్రీరామ చంద్రునికి సహకరించిన హనుమత్, సుగ్రీవాదులతో పాటు జాంబవంతు డున్నాడు. ఆయన ద్వాపరయుగం లోనూ ఉండి శ్రీ కృష్ణ భగవానునికి తన కూతురునిచ్చి పెండ్లి చేశాడు. ఆ జాంబవంతుడు సేవించిన సీతాలక్ష్మణ సమేత శ్రీ రామచంద్రుడే నేడు ఒంటిమిట్ట గుడిలో కొలువై ఉన్నాడు. ఒకే రాతిపై సీతారామ లక్ష్మణ దేవతా మూర్తులుండడం వల్ల ఒంటిమిట్టను ఏకశిలా నగరం అని కూడా అంటారు. కోదండ రామాలయం భారతదేశంలోని ఆంధ్ర రాష్ట్రంలోని వై ఎస్ ఆర్ కడప జిల్లా వొంటిమిట్ట మండలంలో వొంటిమిట్ట పట్టణంలో ఉన్న రామ దేవునికి సంబందించిన హిందూ దేవాలయం.. క్రీ.శ.1356లో బుక్కరాయలు ఆలయాన్ని ప్రారంభించాడు. ఆ తరువాత కాలంలో విజయ నగర రాజులు, చాళుక్య రాజులు క్రమంగా గుడికి అంతరాలం, రంగమంటపం, మహా ప్రాంగణం, గోపురాలు, రథం నిర్మించారు. ఒంటిమిట్ట చుట్టుప్రక్క గ్రామాల రాబడి ఆలయ కైంకర్యాలకు వినియోగించారు. ఈ దేవాలయం మూడు దఫాలుగా నిర్మించారు. 14 శతాబ్దంలో ప్రారంభమై 17 శతాబ్దానికి పూర్తి అయినట్లు ఇక్కడ ఉన్న శాసనాలు తెలుపుతున్నాయి విజయ నగర నిర్మాణ శైలిని పోలి ఉన్న ఆలయం ఇది. ఒంటడు, మిట్టడు అనే ఇద్దరు దొంగలు ఇక్కడ రాముణ్ణి కొలిచి తమ వృత్తిని మానుకుని నిజాయితీగా బ్రతికారని, వారి పేరు మీదుగానే ఒంటిమిట్ట అని పేరు వచ్చిందని ఇంకొక కథనం కూడా ఉంది. మిట్టను సంస్కృతంలో శైలమంటారు. ఈ ఆలయంలో సీతా రామ లక్ష్మణులు ఒకే రాతిలో చిత్రించబడ్డారు. కాబట్టి ఏకశిలా నగరమనీ పేరు వచ్చింది. హనుమంతుడు లేని రామాలయం భారత దేశంలో ఇదొక్కటే. ఈ గ్రామాన్ని గురించి తొలి తెలుగు యాత్రాచరిత్రయైన కాశీయాత్ర చరిత్రలో ప్రస్తావనలున్నాయి. ఆ గ్రంథకర్త ఏనుగుల వీరాస్వామయ్య కాశీ యాత్రలో భాగంగా మజిలీలైన అత్తిరాల నుంచి భాకరాపేట వెళ్ళే మార్గ మధ్యలో ఒంటిమిట్టను దాటి వెళ్ళారు. దీనివల్ల 1830 నాడు గ్రామ స్థితిగతులు తెలియవస్తున్నవి. అప్పటికి గ్రామంలో నాల్గుపక్కల కొండలే కలిగిన భారీ చెరువున్నది. చెరువు కట్టమీద ఉన్న బాటపైనే వారి ప్రయాణం సాగింది. ఆ ఒంటిమిట్టలో చూడ చక్కనైన గుళ్ళు ఉన్నాయన్నారు. గ్రామంలో ఓ ముసాఫరుఖానా యాత్రికుల నిలయం ఉండేదని, అప్పటికే అది బస్తీ గ్రామమని పేర్కొన్నారు. రామ లక్ష్మణులు చిన్నపిల్లలుగా



ఉన్నప్పుడు, విశ్వామిత్రుడు వారిని తమ యాగరక్షణకు తీసుకు వెళ్ళాడు. సీతారామ కల్యాణం జరిగాక కూడా, అలాంటి సందర్భమే ఒకటి ఏర్పడింది. అప్పుడు మృకండు మహర్షి, శృంగి మహర్షి రాముని ప్రార్థించడంతో దుష్టశిక్షణ కోసం, ఆ స్వామి సీతా లక్ష్మణ సమేతుడై అంబుల పొది, పిడిబాకు, కోదండం, పట్టుకుని ఈ ప్రాంతానికి వచ్చి యాగ రక్షణ చేశాడని పురాణం చెబుతుంది. అందుకు ప్రతిగా ఆ మహర్షులు సీతారామ లక్ష్మణుల విగ్రహాలను ఏకశిలగా చెక్కించారనీ, తరువాత జాంబవంతుడు ఈ విగ్రహాలను ప్రాణప్రతిష్ఠ చేశారనీ ఈ ప్రాంత ప్రజల విశ్వాసం. ఆలయ మండపంలో 32 స్తంభాలు ఉన్నాయి. ఈ ఆలయ ప్రధాన విగ్రహం రాముడు కోదండ రామ స్వామిగా పూజించబడ్డాడు. కుడి చేతిపై విల్లు, ఎడమ చేతిలో బాణం, ఒకే రాతితో చేసిన సీత మరియు లక్ష్మణుడితో పాటు నిలబడి ఉన్న భంగిమలో ఉన్నాడు. ఇక్కడ పరమేశ్వరుని లింగం, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, భ్రమరాంబ, నందీశ్వరుడు, భృంగీశ్వరుడు, కాల భైరవుల విగ్రహాలు కొలువై ఉన్నాయి. ఎందరో మహాకవులు శ్రీరామచంద్రుని కరుణకు పాత్రులైనారు. పోతన ఇక్కడే భాగవతాన్ని తెనిగించి నట్లు చెపుతారు. అయ్యలరాజు తిప్పయ్య ఒంటిమిట్ట శ్రీ కోదండ రామునిపై రఘువీర శతకం రచించి, అంకిత మిచ్చారు. రామభద్ర కవి రామాభ్యుదయమును రచించారు. నల్లకాల్వ అయ్యప్ప ఒంటిమిట్ట రాముని వరం పొంది వరకవి అయ్యారు. ఉప్పుగుండూరు వేంకటకవి ఒంటిమిట్ట దశరథరామ శతకం రచించారు. ఆంధ్రవాల్మీకిగా ప్రసిద్ధి పొందిన వావిలికొలను సుబ్బారావు గారు ఆంధ్రవాల్మీకి రామాయణం మందర వ్యాఖ్యతో రచించారు. తాళ్ళపాక అన్నమయ్య రామునిమీద సంకీర్తన చెప్పారు. శ్రీ కోదండ రామస్వామి వారి దేవాలయాన్ని దేవదాయ ధర్మాదాయశాఖ నుంచి 9-9-2015వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం విలీనం చేసుకున్నది. స్వామి వారి క్షేత్రంలో ఏటా శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతాయి. ఒంటిమిట్టలో ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి నుండి బహుళ విదియ దాకా బ్రహ్మోత్స వాలు జరుగుతాయి. వైఎస్సార్ కడప జిల్లాలోని ఒంటిమిట్టలో జగదభిరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. చతుర్దశి నాడు కళ్యాణం, పౌర్ణమి నాడు రథోత్సవం ఉంటాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 2న రథోత్సవం, ఏప్రిల్ 4న చక్రస్నానం, ఏప్రిల్ 5న పుష్పయాగము నిర్వహించనున్నారు.

# వయోవృద్ధులకు ఆసరాగా ప్రణామ్ డే కేర్ సెంటర్

## రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)

ములుగు జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

ప్రణామ్ డే కేర్ సెంటర్ వయవృద్ధులకు ఆసరాగా నిలుస్తాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనములో ఏర్పాటుచేసిన ప్రణామ్ వయవృద్ధుల డే కేర్ సెంటర్ ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ డే కేర్ సెంటర్ లో వయోవృద్ధులు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు అహ్లాదకరమైన వాతావరణం కల్పించడం జరుగుతుందని, మానసిక ఉల్లాసానికి ఆటలు, రాగి జావా టి అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమం కొరకు కొత్త చట్టం రూపొందించడం జరిగినదని ఎవరైనా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు వారి యొక్క తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టప్రకారం వారి జీతంలో 10 శాతం నుండి 15 శాతం వరకు కోత విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. వయోవృద్ధుల సంక్షేమం పిల్లల యొక్క బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయవృద్ధుల పట్ల వారి పిల్లలు నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు. డే కేర్ సెంటర్ ల వయోవృద్ధులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసిక ఉల్లాస కార్యక్రమాలు, యోగ , మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, డే కేర్ సెంటర్ ను వయవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, బి డబ్ల్యు ఓ ప్రేమలత, కౌన్సిలర్లు, రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వయోవృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.




# ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణలో ఇబ్బంది లేకుండా చూడాలి

ములుగు, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ దివాకర టి.ఎస్. ఆదేశాల ప్రకారం జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకొని ముందుకు సాగుతుందని అదనపు కలెక్టర్ సి. హెచ్. మహేందర్ జి అన్నారు. బుదవారం ఏటూరు నాగారం, తాడ్వాయి మండల కేంద్రంలలోని రైతు వేదికలో అదనపు కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భాల్లో అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి మాట్లాడుతూ ఇప్పటి వరకు సహకార (81 ) ఐకెపి (52) గిరిజన కార్పొరేషన్ (0) ఫ్రీూ (7) మొత్తం (140) కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, అందుకు సంబంధించిన రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి ప్రభుత్వం నుండి (డబ్బులు) పేమెంట్ త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ వెంట వెంటనే వారి వారి ఖాతాలలో డబ్బులు జమ కావడం జరుగుతుందన్నారు, కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేస్తాము అన్నారు అదే విధంగా హార్వెస్టర్ యజమానులకు, తసీల్దార్లకు ఆదర్శ రైతులకు, కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులకు రైతు వేదికలుగా ఉన్న ఏటూరునాగారం, తాడ్వాయి మరియు ములుగు ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాల్లో డీసీఎస్ఓ ఫైజల్ హుస్సేన్, డిఎం కృష్ణవేణి, జిల్లా కేంద్రం నుండి పర్యవేక్షణ ద్వారా సహకార శాఖ డీసీఓ , ఐకెపి, ఎఫ్ పి ఒ ,స్థానిక తహసీల్దారులు, వ్యవసాయ పౌరసరఫరాల శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పర్యవేక్షణ ద్వారా ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకొని ముందుకు సాగుతున్నారు.




# ప్రభుత్వ భూమి సాగు రైతులకు హక్కులు కల్పించాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

భూపాలపల్లి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న రైతులను నిర్ధారణ చేసి గుర్తించి భూ హక్కు పత్రాలు జారీ చేయుటకు చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో భూపాలపల్లి డివిజన్ పరిధిలోని రెవెన్యూ మరియు అటవీ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు జారిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలాల వారిగా ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న రైతులు, భూ సమస్యల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మారావుపేట గ్రామంలోని రైతులు దీర్ఘకాలంగా సాగు చేస్తున్న భూమిలో సింగరేణి గనులు ఏర్పాటుతో కొందరు రైతులు భూములు కోల్పోయారని వారికి



పరిహారం అందించాలని సూచించారు. గనులు ఏర్పాటు తదుపరి మిగిలిన భూములను సాగు చేస్తున్న రైతులకు భూ హక్కు పత్రాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సింగరేణి గనులు, జెన్కో పరిశ్రమ ఏర్పాటుతో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి సాగుచేస్తూ జీవనం సాగిస్తున్న రైతులకు గ్రామ సభలు నిర్వహించడం ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని తెలిపారు. కోర్టు వివాదాల్లో లేని భూములు జోలికి వెళ్లకుండా ఇతర భూములకు హక్కు పత్రాలు జారీ చేయాలని సూచించారు. దాదాపు 70 సంవత్సరాలుగా సాగులో ఉన్న రైతులకు కోర్టు కేసులు లేని పక్షంలో గ్రామ సభల ద్వారా భూ హక్కు పత్రాలు జారీ చేయాలని తెలిపారు. భూ హక్కు పత్రాలు లేకపోవడం వల్ల రైతులు రైతు భరోసా, రైతు భీమా వంటి ప్రయోజనాలను పొందలేకపోతున్నారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కోర్టు వివాదాలు లేని భూములను లైసెన్స్ సర్వేయర్ల ద్వారా సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, ఆర్డిఓ హరికృష్ణ, భూపాలపల్లి డివిజన్ పరిధిలోని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చల్లా

సంగెం, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

వరంగల్ జిల్లా, సంగెం మండలంలోని పటాన్ తండ, కొత్తగూడెం, సోమ్లతండ, కాట్రపల్లి గ్రామాలలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన గుగులోతు హరిలాల్, వాసం వీరలక్ష్మి, మన్జ్య నాయక్, పోషాల చంద్రశేఖర్ కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మండలంలోని సపావత్ తండకు చెందిన బిఆర్ఎస్ నాయకులు, మాజీ సొసైటీ చైర్మన్ సపావత్ కిషన్, తీగరాజుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు రంగరాజు శ్యామ్ సుందర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ధ్యేయం

**సొంతింటి కల ఇందిరమ్మ ప్రభుత్వంలో నెరవేరుతుంది**
**గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి**



గీసుగొండ, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

బుధవారం గీసుగొండ మండలం వంచనగిరి గ్రామంలో మైనాల శ్రావణ్ కుమార్ నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసి, సందర్భంగా లబ్ధిదారులకు శాలువాతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

## గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

ములుగు జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 న నిర్వహించే గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. ఏప్రిల్, 2న నిర్వహించబోయే గ్రామ సభలు, మున్సిపల్ వార్డుల్లో సభల నిర్వహణ పై బుధవారం మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు ఇచ్చారు. గ్రామ సభలు, మున్సిపల్ సభలు పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని, గ్రామ సభల్లో ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో టామ్ టామ్ చేయించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ రెండున్నర సంవత్సరాల్లో అనేక అభివృద్ధి పనులను చేపట్టిందని, అదేవిధంగా కొత్తగా మరికొన్ని పతాకాలు చేపట్టబోతుంది. ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వార ఆయా గ్రామ పంచాయతీలు, వార్డు, మున్సిపాలిటీలో ఈమేరకు అభివృద్ధి పనులు జరిగాయి, తదితర విషయాలను గ్రామ సభ సందర్భంగా ప్రజలకు వివరించాలని సూచించారు. కొత్త పథకాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఇచ్చిన రైతు భరోసా, రుణ మాఫీ, ధాన్యం సేకరణ, రైతులకు 500 రూపాయల బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పొందిన లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు, 500 రూపాయలకే సిలిండర్, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు తదితర అన్ని వివరాలను తెలియ చేయాలని సూచించారు. లబ్ధిదారుల పేర్లు సైతం చదివి వినిపించాలని చెప్పారు. ఎవరైనా అర్జీలు ఇచ్చేవారు ఉంటే వాళ్లనుండి దరఖాస్తులు తీసుకునేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి అర్జీలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభకు అత్యధికంగా ప్రజలు వచ్చే విధంగా చూడాలని, గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా టెంట్, షామియానా, మంచినీరు, ముఖ్యమంత్రి సందేశం చూసేందుకు టి.వి తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి గ్రామ సభకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్

## 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ

ములుగు జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):



రేషన్ కార్డు లబ్ధిదారుల విషయంలో రాబోయే వేసవి కాలం దృష్ట్యా ఒకేసారి మూడు నెలల సరిపడా రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఏప్రిల్ నెలలోనే పంపిణీ జరిగేలా చూడాలని, మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే ఎండలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రంలోనే రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ములుగు జిల్లాలో దాదాపు 1 లక్ష 2 వేలకి పైగా కార్డులు ఉన్నాయి. ఒకేసారి మూడు నెలలకు సరిపడ కోటా 5,490మీం బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినదని, తగు ఏర్పాట్లు చేసినామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైని తెలియపరిచినారు. ఒకేసారి మూడు నెలలకు సంబంధించి ఒక్కో కార్డుదారుడు 3 సార్లు వేలి ముద్ర (థంబ్) వేయాల్సి ఉందని, దీనికి తోడు సర్వర్ సమస్యలు రాకుండా తగు చర్య లు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తెలియపరిచినారు.

## గడ్డి మందు పారాక్వాట్ అమ్మకాలపై నిషేధం

**వ్యవసాయ అధికారి అనురాధ**

వరంగల్ జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

రాష్ట్ర ప్రభుత్వం పారాక్వాట్ గడ్డిమందు అమ్మకాలపై 60 రోజుల పాటు నిషేధం విధించింది. ఇదే విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. నిబంధనలు ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ తెలిపారు. పారాక్వాట్ అనే గడ్డిమందు అత్యంత విషపూరితమైనది, ఇది ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారింది. ఈ మందును చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణికావేశంలో సేవించిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె అన్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం పారాక్వాట్ గడ్డిమందు అమ్మకాలు, నిల్వలు మరియు వినియోగంపై 60 రోజుల పాటు నిషేధం విధించింది. ఇదే విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేశారు. పారాక్వాట్ గడ్డిమందు నిషేధం విషయంలో ఇప్పటికే కేరళ, ఒడిశా రాష్ట్రాలు చర్యలు తీసుకున్నాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూడా ఈ మందును నిషేధించాలని డిమాండ్ చేసిందని ఆమె తెలిపారు. జిల్లాలోని పురుగుమందు డీలర్లు ఈ గడ్డి మందులు అమ్మకూడదని అమ్మినచో కఠిన చర్యలు తీసుకోబడిన తెలియజేశారు. రైతులు ఇట్టి గడ్డి మందులు కొనకూడదు మనకు వాడకూడదని తెలియజేసినారు.

# ముగిసిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

## జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి డా.ఓలేటి జ్యోతి





**మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):** జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్.టి.ఆర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు 18 మండలాల నుంచి 121 మంది విద్యార్థులు హాజరై పోటీలలో పాల్గొన్నారని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి డా.ఓలేటి జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో నాలుగవ తరగతి ప్రవేశం పొందేందుకు మూడవ తరగతి చదువుతున్న బాలబాలికలకు వివిధ అంశాల్లో 9 రకాల పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, షటిల్ రన్, 800 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి, వారి ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించామన్నారు. ఈ పోటీలలో జిల్లా స్థాయిలో ఎంపికైన 10 మంది బాలికలు, 10 మంది బాలురకు ఏప్రిల్ 27 నుంచి హకీంపేట క్రీడా ప్రాంగణంలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ పెండింగ్ పనులను పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):** న్యూ శాయంపేటలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన మౌలిక వసతుల పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ న్యూ శాయంపేటలోని నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన బ్లాక్ లను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల సముదాయంలో కల్పించిన మౌలిక వసతులను కలెక్టర్ తనిఖీ చేశారు. వసతులను గురించిన వివరాలను ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, గృహ నిర్మాణ శాఖ పిడి సిద్ధార్థ నాయక్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ లకు సంబంధించిన 19 బ్లాక్ లలోని 608 గృహాలకు మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీ, తదితర సదుపాయాలను వెంటనే మొదలుపెట్టి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఇతర అభివృద్ధి పనులు కూడా పది రోజుల్లో పూర్తి చేయాలని అధికారుల ఆదేశించారు. గృహ సముదాయాలకు సంబంధించిన తాగునీటి వ్యవస్థను క్షేత్రస్థాయిలో



పరిశీలించి అందుకు సంబంధించిన మోటార్లను సత్వరమే బిగించాలని అధికారులకు సూచించారు. ప్రధాన రోడ్డు నుండి డబుల్ బెడ్ రూమ్ వరకు ఉన్న రోడ్డును వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా గృహాలకు సంబంధించిన విద్యుత్ సరఫరా, ఫీడర్ ఛానల్ పనులు వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ సభలు విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):** జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలు లో భాగంగా గ్రామ సభలను విజయవంతగా నిర్వహించాలి అని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డు సభలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సభలకు హాజరయ్యే ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే సభల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం ప్రతి శాఖ తమకు సంబంధించిన పథకాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి ప్రజలకు వివరించాలని చెప్పారు. సభలు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా షామియానాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. విద్యాశాఖ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, వ్యవసాయ శాఖ రైతులకు లాభదాయక పంటలు, ఉద్యాన పంటలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి జిల్లాలో వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలను విజయవంతం చేయడం ద్వారా ప్రజల సమస్యలకు సమర్థవంతమైన



పరిష్కారం చూపడం ముఖ్య లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు సభలకు సమయానికి హాజరై స్థానిక సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మహిళలు మీ గుండె ఆరోగ్యం పట్ల బీకేర్ ఫుల్

**కరీంనగర్ :** డాక్టర్. యమున మాట్లాడుతూ భారతదేశంలో మహిళల మరణాలకు గుండె జబ్బులే ప్రధాన కారణం.మహిళల్లో విభిన్నంగా ఉండే హార్ట్ ఎటాక్ లక్షణాలు:మెనోపాజ్ తర్వాత తగ్గే ఈస్ట్రోజెన్ హార్మోన్ రక్షణఅధిక రక్తపోటు,ఊబకాయంతో పెరుగుతున్న ముప్పు,జీవనశైలి మార్పులతోనే గుండె ఆరోగ్యం పదిలం.గుండెపోటు అనగానే సాధారణంగా పురుషులకే వస్తుందనే అపోహ చాలామందిలో ఉంది.కానీ వాస్తవానికి ఇది మహిళల ప్రాణాలకు కూడా పెనుముప్పుగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ,గణాంకాల ప్రకారం.. 2021లో భారతదేశంలో కొవిడ్-19 తర్వాత మహిళల మరణాలకు'ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్ ఐహెచ్ డీ' రెండో ప్రధాన కారణమని తేలింది.ఆ ఏడాది లక్ష మందిలో 159.9 మంది కొవిడ్ వల్ల మరణించగా,99.4 మంది ఈ గుండె జబ్బు కారణంగా ప్రాణాలు కోల్పోయారు..ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్‌నే కరోనరీ హార్ట్ డిసీజ్ అని కూడా పిలుస్తారు.

## ముందస్తు ఖరీఫ్ నందు

## రైతులు ఉల్లి సాగును తగ్గించాలి

**తుగ్గలి:** ముందస్తు ఖరీఫ్ (ఎండాకాలం) నందు రైతులు ఉల్లి సాగును సాధ్యమైనంత వరకు తగ్గించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేసినట్లు తుగ్గలి మండల వ్యవసాయ అధికారి సురేష్ యాదవ్ తెలియజేశారు.బుధవారం రోజు ఆయన మాట్లాడుతూ స్థానిక పరిస్థితుల ఆధారంగా అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తెలియజేశారని,సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు అందరూ రైతులకు సరైన అవగాహన కల్పించి ఇతర పంటలను సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు.మార్కెట్ పరిస్థితులను ఆధారంగా రైతులకు లాభం కలిగేలా పంట ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ తెలియజేశారని ఏవో తెలియజేశారు.కావున సంబంధిత అధికారులు అందరూ కఠినంగా ఈ నియమాలను పాటించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను చేసి ఎండాకాలంలో ఉల్లి సాగును తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలియజేశారు.

## హనుమాన్ జయంతి శోభయాత్రలో

## డీజేలకు అనుమతి లేదు

**మహబూబ్ నగర్ :** "హనుమాన్ జయంతి" పండుగను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతలు పరిరక్షణ కోసం శోభయాత్రలలో డీజేలను అనుమతించవద్దని జిల్లా పోలీసు శాఖ కఠిన నిర్ణయం తీసుకున్నది. జిల్లా ఎస్పీ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ అప్పయ్య పట్టణ పరిధిలోని డీజే నిర్వాహకులను పోలీస్ స్టేషన్కు పిలిపించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి స్పష్టమైన మరియు కఠినమైన సూచనలు జారీ చేశారు. శోభయాత్రలలో డీజేలను వినియోగించరాదని, ఎవరైనా ఈ ఆదేశాలను ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా, పట్టణంలోని డీజే యజమానులందరినీ మహబూబ్నగర్ అర్బన్ తహశీల్దార్ సమక్షంలో బైండోవర్ చేయడం జరిగినది. పండుగ సందర్భంగా శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు, నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలని ఇన్స్పెక్టర్ కోరారు.

## గద్దర్ ఫౌండేషన్ సభను జయప్రదం చేయండి

**ప్రజా సంఘాల పిలుపు**

**మెదక్ :** గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న హైదరాబాద్ లో జరిగే ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాలపై రాష్ట్ర స్థాయి సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు జెల్లా సుధాకర్, పి శంకర్, హైమద్ లు పిలుపునిచ్చారు. గద్దర్ ఫౌండేషన్ పోస్టర్ ను బుధవారం నాడు మెదక్ గుల్షన్ క్లబ్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా యుద్ధ నౌక గద్దర్ పై కాల్పులు జరిగిన రోజున గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సభను నిర్వహిస్తారని తెలిపారు. ఈ దినాన్ని గద్దర్ పునర్జన్మ దినంగా సైతం పాటిస్తారని తెలిపారు. ఏప్రిల్ 6న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం ఐదు గంటల నుండి జరిగే ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాల సభకు ప్రతి ఒక్కరు హాజరుకావాలని కోరారు.

## సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):** మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరంలో జరుగనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాల పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఘాట్ల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెవెన్యూ, దేవాదాయ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు కేటాయించిన పనులను సమన్వయంతో నిర్వహించి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా చర్యలు, వైద్య సదుపాయాలు కూడా సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పీఆర్, విద్యుత్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నివారణ పై సమీక్ష సమావేశం

**జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.బి.రవి రాథోడ్**



**మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):** జిల్లాలో హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ, చికిత్స మరియు అవగాహన కార్యక్రమాల పురోగతిపై బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో హెచ్ఐవి పరీక్షలు, ఏ ఆర్ టీ సెంటర్ల సేవలు, గర్భిణీ స్త్రీలకు స్క్రీనింగ్, మరియు హెచ్ఐవి వ్యాప్తిని నివారించడానికి తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ మాట్లాడుతూ, హెచ్ఐవి నివారణలో అవగాహన ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ సురక్షిత జీవన విధానాలను పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తక్షణ చికిత్స అందించాలని అధికారులకు ఆదేశించారు. లింక్ వర్కర్స్, సర్వోదయ స్వచ్ఛంద సంస్థ, కోఆర్డినేటర్స్, సమన్వయంతో పనిచేసి హెచ్ఐవి కేసుల గుర్తింపు, చికిత్సలో శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే, యువతలో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అర్జున్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కె ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు, నీలిమా శ్వేత,ఆశోక్, సారంగం సిఎస్ఓ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ , కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

## కొత్తగూడెం కేంద్రంగా డివిజన్ ...

ఖమ్మం : కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్రలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లకు రాకపోకలు సాగించే రైళ్లకు కూడలిగా మారినందున దాన్ని ప్రధానకేంద్రంగా మార్చాలన్నారు. కొత్తగూడెంకు బ్రిటిష్‌పాలన నుంచి చారిత్రక నేపథ్యం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఇక్కడి నుంచి బొగ్గు రవాణా జరిగేదని.. సింగరేణి కాలరీస్‌కు ఇప్పుడు ఇది ఒక ప్రధాన కేంద్రంగా మారిందన్నారు.గూడ్స్ ట్రైన్ల రవాణా ద్వారా భారతీయ రైల్వేకు అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న ప్రాంతాల్లో కొత్తగూడెం ఒకటి అన్నారు. కొత్తగూడెం-కిరండోల్, మల్కన్‌గిరి-భద్రాచలం, కొత్తగూడెం-సత్తుపల్లి-కొవ్వూరు, జునాగఢ్-మల్కన్‌గిరి-భద్రాచలం లింకులతో ఈ స్టేషన్ నాలుగు రాష్ట్రాల ప్రధాన కూడలిగా మారిందని వెల్లడించారు. 2032 నాటికి వందేళ్లు పూర్తిచేసుకోబోతున్న ఈ స్టేషన్‌కు తగిన గుర్తింపు ఇవ్వాలని స్థానిక ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారని గుర్తు చేశారు. శతవసంతాల గుర్తుగా కొత్తగూడెం కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేసి ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని ఎంపీలు కేంద్రమంత్రికి సమర్పించిన వినతిపత్రంలో వెల్లడించారు.కాగా, కొత్తగూడెం కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఆ ప్రాంత సామాజిక, ఆర్థిక ముఖచిత్రం గణనీయంగా మారుతుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉండటం వల్ల పరిపాలనాపరమైన నిర్ణయాల్లో జాప్యం జరుగుతోందని... కొత్తగూడెం కేంద్రంగా డివిజన్ ఏర్పాటైతే ఈ ప్రాంతానికి స్వయంప్రతిపత్తి లభించి, రైల్వే మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమవుతుందని చెబుతున్నారు. సింగరేణి కాలరీస్, కె.టి.పి.ఎస్, ఐటిసి వంటి భారీ పరిశ్రమలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని... బొగ్గు రవాణా ద్వారా రైల్వేకు వచ్చే భారీ ఆదాయం ఇక్కడి అభివృద్ధికి తిరిగి వినియోగించబడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.స్థానిక ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త రైళ్లను ప్రారంభించేందుకు, రైళ్ల సమయాలను క్రమబద్ధీకరించేందుకు వీలవుతుంది. భద్రాచలం వంటి పుణ్యక్షేత్రానికి దేశవ్యాప్త అనుసంధానం పెరుగుతుందని అంటున్నారు. డివిజనల్ కార్యాలయం ఏర్పాటుతో వందలాది మందికి ప్రత్యక్షంగా, వేలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. స్థానిక వ్యాపారాలు పుంజుకుంటాయని చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్ల నిర్మాణం, స్టేషన్ల ఆధునీకరణ పనులు వేగంగా పూర్తవుతాయని.. కొత్తగూడెం రైల్వే డివిజన్ ఏర్పాటు కేవలం రవాణా సౌకర్యమే కాకుండా, వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజిన్‌లా పనిచేస్తుందని అంటున్నారు.

# మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా

## పాఠశాలలో జిల్లా కలెక్టర్ అంకిత్ ఆగ్రహం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏప్రిల్ 01లితీన్మార్ న్యూస్):

దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృత పర్యటన నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం, పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, ముఖ్యంగా మధ్యాహ్న భోజన నాణ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి, దరఖాస్తుల పరిష్కార విధానంపై అధికారులను ప్రశ్నించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి, కుల ధృవీకరణ, ఆదాయ, నివాస ధృవీకరణ, రేషన్ కార్డుల వంటి దరఖాస్తుల పురోగతిని తెలుసుకున్నారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. మీ సేవ ద్వారా చెల్లించవలసిన రుసుముల వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. భూ సమస్యలు, సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాల్సి ఉండగా, ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి ఎందుకు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తోందని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డు రూమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై, విద్యుత్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, వ్యవసాయం, పోలీస్ శాఖల పనితీరును సమీక్షించారు. గ్రామసభల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని, వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దమ్మపేట తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్,ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు. మెనూ ప్రకారం ఆ రోజు చికెన్ బగారా రైస్




అందించాల్సి ఉండగా, అది అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, మెనూ పాటించకపోవడంపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు అందించవలసిన ఆహారాన్ని ఎందుకు ప్రదర్శించడం లేదని వెంటనే ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా రుచి చూసిన కలెక్టర్, ఆహార నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా అని ప్రశ్నిస్తూ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్మేకర్ కూర సరిగా నువ్వు ఉడక పోవడం , రుచి, నాణ్యత లోపించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందించాలని, భవిష్యత్తులో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశంలో కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతున్న పరిస్థితిని గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు, భద్రతా చర్యలపై ఆరా తీసి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, ఉపాధ్యాయురాలు స్టెల్లా, వార్డెన్ దుర్గ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముస్లింలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్ని కాంగ్రెస్ సర్కార్ నెరవేర్చడం లేదు

**సిద్దిపేట** : హరీష్ రావు మాట్లాడుతూ కేటాయించిన బడ్జెట్లో సగం కూడా ఖర్చు చేయడం లేదుకెసిఆర్ పాలనలో ముస్లిం లా సంక్షేమానికి పెద్దపీట. ముస్లింలకు చిన్న చూపు చూస్తున్న రేవంత్ సర్కార్ ముస్లింలకు అండగా బిఆర్ఎస్మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీష్ రావు.అసెంబ్లీలో ముస్లిం మైనార్టీల కోసం కాంగ్రెస్ సర్కార్ ను నిలదీసిన సందర్భంగా హరీష్ రావు ను కలసి కృతజ్ఞతలు తెలిపిన సిద్దిపేట ముస్లిం మైనార్టీ లు. కాంగ్రెస్ సర్కార్ ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మండిపడ్డారు. అసెంబ్లీలో ముస్లిం మైనార్టీల కోసం కాంగ్రెస్ సర్కార్ ను నిలదీసిన ఎమ్మెల్యే హరీష్ రావును పట్టణానికి చెందిన ముస్లిం నాయకులతోపాటు మత పెద్దలు కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి 4 వేల కోట్లు బడ్జెట్లో పెడతామని చెప్పిన రేవంత్ రెడ్డి సర్కార్ కేవలం 3500 కోట్లు మాత్రమే బడ్జెట్లో పెట్టిందన్నారు. ఇందులో కూడా 1600 కోట్లు మాత్రమే సంక్షేమానికి ఖర్చు చేసిందన్నారు. అదే కెసిఆర్ పాలనలో ముస్లింల సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్ ను అత్యధికంగా ఖర్చు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో ఉర్దూ అకాడమిలో పనిచేసే 130 మందికి తొమ్మిది నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. అలాగే ఇమామ్, మౌజాన్లకు 12 వేల జీతభత్యాలు ఇస్తామని నేటికీ ఇవ్వడం



లేదన్నారు. ముస్లింలను రేవంత్ సర్కార్ చిన్నచూపు చూస్తుందన్నారు . దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లింల సంక్షేమానికి పెద్ద పీటవేశారన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన టిమ్రిస్ పాఠశాలల్లో 1,20,000 మంది విద్యార్థులు చదువుకునేవారు కానీ కాంగ్రెస్ సర్కార్ వచ్చాక 30,000 మంది విద్యార్థులు తగ్గిపోయారన్నారు. ముస్లింల సంక్షేమానికి చిన్న చూపు చూస్తే బిఆర్ఎస్ చూసుకుంటూ ఊరుకోదని హెచ్చరించారు. బిఆర్ఎస్ ముస్లింలకు అండగా నిలుస్తుంది అన్నారు.

# ఏప్రిల్ 15 లోపు హెచ్.ఎల్.బీ బ్లాక్ నిర్ధారణ పూర్తి

**జనగణన 2027 పై సంబంధిత అధికారులతో సమీక్ష**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి** : జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 15 లోపు హెచ్.ఎల్.బీ బ్లాక్ నిర్ధారణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. జనగణన2027 పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జనగణన 2027 రెండు దశలలో జరుగుతుందని, ప్రస్తుత సంవత్సరం హౌజ్ లిస్టింగ్ కార్యక్రమం మే 10 నుంచి ప్రారంభం అవుతుందని, ప్రతి ఇంటికి సంబంధించి 35 ప్రశ్నల వివరాలు నెల రోజుల వ్యవధిలో సేకరించాలని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 2027 లో హౌస్ లిస్టింగ్ ప్రకారం జనాభా వివరాల సేకరణ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి 300 ఇండ్లు/800 జనాభా ఒక బ్లాక్ గా (హెచ్.ఎల్.బీ) నిర్దేశించి జనాభా లెక్కల చేసేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఫీల్డ్ సర్వే సమయంలో మనం వేసుకునే అంచనా కంటే ఎక్కువ ఇండ్లు ఉండే అవకాశం ఉన్నందున 15 శాతం అధికంగా ఎన్యుమరేటర్లు నియామకం చేపట్టాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో హెచ్.ఎల్.బీ లు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల వారీగా ఏర్పాటు చేయనున్న హెచ్.ఎల్.బీ. పేపర్ మీద



రిపోర్ట్ సిద్ధం చేసుకొని ఆన్ లైన్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి హెచ్.ఎల్.బీ పరిధిలో ఉన్న ఇండ్లు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, ఆట స్థలాలు, ఆసుపత్రులు ఏం ఉన్నాయో సరిగ్గా ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. హెచ్.ఎల్.బీ ప్రక్రియ ఎంత పకడ్బందీగా చేసుకోగలిగితే రాబోయే 1.5 సంవత్సరాల కాలం పాటు జనాభా లెక్కల కార్యక్రమం అంత ప్రశాంతంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. హెచ్.ఎల్.బీ విభజన రాబోయే 10 రోజులలో తహసిల్దారులు స్థానిక పంచాయతీ కార్యదర్శి మున్సిపల్ కమిషనర్లు సహకారంతో పూర్తి చేయాలని 200 నుంచి 300 ఇండ్లు ఉన్న చిన్న చిన్న గ్రామ పంచాయతీలు, వార్డుల హెచ్.ఎల్.బీ ఆన్ లైన్ ఎంట్రీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ 15 లోపు తుది హెచ్.ఎల్.బీ నిర్ధారణ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్.ఎల్.బీ ఆన్ లైన్ ఎంట్రీ సమయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. జనగణన 2027 కార్యక్రమం చాలా ముఖ్యమైన అంశమని, దీనిని ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. హౌస్ లిస్టింగ్ నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 1400 ఎన్యుమరేటర్లు అవసరం ఉంటుందని అంచనా వేశామని, ప్రతి గ్రామం మున్సిపాలిటీ పరిధిలో ఎంతమంది ఎన్యుమరేటర్ అవసరం ఉన్నారో వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డిఓ లు బి. గంగయ్య, సురేష్ , ఎంపీడీవోలు, తహసిల్దారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ సత్య శారద**

**గ్రామ, వార్డు సభల నిర్వహణపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్**




వరంగల్ జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామ సభల ద్వారా ప్రజలకు సమగ్రంగా వివరించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్లతో గ్రామ, వార్డు సభల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించే గ్రామ సభల్లో ప్రభుత్వ పథకాల వివరాలను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారికి సభల్లో మాట్లాడే అవకాశం కల్పించి, ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను గ్రామ సభల ద్వారా నిర్ణయించి తీర్మానాలు చేయాలని, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. గ్రామ సభల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వై వి గణేష్, డి ఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రాం రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఆర్డీఓ లు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణ ప్రక్రియ పక్కాగా చేపట్టాలి

**ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):



రబీ సీజన్లో రైతులు పండించిన ధాన్యాన్ని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సజావుగా కొనుగోళ్లు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, అవసరమైన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లు జరగాలన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని విక్రయించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, తడి కొలిచే పరికరాలు, గోదాముల సదుపాయం, టార్ఫాలిన్లు, గన్నీ సంచులు, తాగునీరు, విశ్రాంతి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రసీదులు అందజేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎంసీఎస్ హాథీరామ్, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ వసంత, డీసీఎస్ఓ పావని, డీసీఓ కోదండరాములు, డీఎంఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఓపీ, ఐపీ కేసులు -- రోజూవారి సేవలపై ప్రత్యేక దృష్టి

**విద్యార్థినులకు పోషకాహారం అందించాలి**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ జిల్లా, ఏప్రిల్ 01 (తీన్మార్ న్యూస్):



బుధవారం, జిల్లాలోని జఫర్గడ్ మండల పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోజూవారిగా వస్తున్న ఓపీ (ఔట్ పేషెంట్), ఐపీ (ఇన్ పేషెంట్) కేసుల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల కేసులు, గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో చర్చించారు. ప్రసవాల సంఖ్యను మరింతగా పెంచాలని సూచించారు. వార్డుల్లో రోగులకు అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. డెంటల్ విభాగం, స్కానింగ్ సెంటర్ పనితీరును పర్యవేక్షించారు. ఔషదాల నిల్వలను పరిశీలించి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. డయాలసిస్ తీసుకుంటున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న సేవల గురించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాల పరిసరాల పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. రక్త నమూనాల సేకరణ, నిల్వ విధానాలను తనిఖీ చేసి, సరైన ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ క్రమంలో మౌలిక వసతులు మెరుపరచాలని, వైద్యులు, సిబ్బంది సమయానుగుణంగా అందుబాటులో ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జఫర్గడ్ మండలంలోని సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలను కలెక్టర్ సందర్శించి, వంటశాలను తనిఖీ చేశారు. వంటకు ఉపయోగించే సామాన్లు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం పరిశుభ్రంగా ఉండాలని, పోషకాహారం అందించాలని సూచించారు. పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్ వినియోగాన్ని కూడా పర్యవేక్షించారు. పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడి, రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అందుకే తెలుగు సినిమాల్లో నటించడం లేదు మలయాళ స్టార్‌టొవినో థామస్



మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ "పల్లిచట్టంబి". ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా హీరో టొవినో థామస్, హీరోయిన్ కయదు లోహర్ మీడియాతో ముచ్చటించారు. హీరో టొవినో థామస్ మాట్లాడుతూ.. డిజో పల్లిచట్టంబి కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైటింగ్ గా అనిపించింది. ఈ సినిమా చేయాలని ఫిక్స్ అయ్యాం. ఆ తర్వాత నేను కమిట్ మూవీస్ ఫినిష్ చేశాను. డిజో కూడా జనగణమన సినిమాతో పాటు మరో మూవీ రూపొందించాడు. ఆ తర్వాత ఈ సినిమా వర్క్ ప్రారంభించాం. కొద్ది రోజుల తర్వాత ప్రొడ్యూసర్ మారారు. మేము వేరే ప్రొడ్యూసర్స్ ను ప్రాజెక్ట్ లోకి తీసుకున్నాం. ఈ కథ ప్రకారం హీరో బలంగా కనిపించాలి. విలన్స్ ను విసిరిపారేసేలా ఉండాలి. అందుకే వెయిట్ పెరిగాను. అప్పటిదాకా డైటింగ్ చేసే నేను ఈ చిత్రం కోసం డైటింగ్ పక్కనపెట్టాను. హెయిర్ స్టైల్, మీస కట్టుతో ఒక మంచి లుక్ లోకి మారాను. డిజోతో వర్క్ చేయడంలో ఎలాంటి ప్రెజర్ ఉండదు. సెట్ లో కూల్ గా వర్క్ చేసుకుంటూ వెళ్తాడు. ఆయనకు కోపం వస్తుందా అనేది కూడా తెలియదు. పల్లిచట్టంబి సినిమా 50వ దశకంలో కేరళలో జరిగిన ఇన్సిడెంట్స్ స్ఫూర్తిగా ఫిక్షనల్ గా సాగే మూవీ. అప్పుడు సామాజికంగా ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో వాటినే మూవీలో చూపించాం. అంతేకానీ ఆ పరిస్థితుల నేపథ్యాన్ని మా అభిప్రాయ కోణంలో చూపించలేదు. మీరు ఒక్కసారి సినిమా చూస్తే మూవీ సోల్ అర్థమవుతుంది. మా మూవీలో మానవత్వం ముఖ్యమనే పాయింట్ ను చూపిస్తున్నాం. నా వ్యక్తిగత అభిప్రాయంలో కూడా మనమంతా ఒక్కటే. ఎవరు తక్కువ, ఎవరు ఎక్కువ కాదు. పల్లిచట్టంబి ఒక బ్యూటిఫుల్ ఎమోషనల్ ఫిలిం, ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది.



# ఆ అవకాశం ఇప్పటివరకూ రాలేదు మాళవికా నాయర్

"చిత్ర పరిశ్రమలో ఇన్నేళ్ల నా సినీ ప్రయాణం పట్ల ఒక నటిగా హ్యాపీగా ఉన్నాను. అయితే సంతృప్తిగా లేను. నేను పూర్తి స్థాయిలో సంతృప్తి చెందే పాత్ర చేసే అవకాశం ఇప్పటివరకు రాలేదు. ఇంకా మంచి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను. అయితే 'బైకర్' సినిమాలో నటనకి ప్రాధాన్యం ఉన్న పాత్ర చేశాను. ఈ చిత్రం కుటుంబ ప్రేక్షకులకు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది" అని హీరోయిన్ మాళవికా నాయర్ చెప్పారు. శర్వానంద్, మాళవికా నాయర్ జోడీగా నటించిన చిత్రం 'బైకర్'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహించారు. విక్రమ్ సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ--ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా మాళవికా నాయర్ విలేకరులతో మాట్లాడుతూ-- "బైకర్' కథ మూడు టైమ్‌లైన్స్‌లో సాగుతుంది. నా పాత్ర కూడా ఇన్‌వాల్వ్ అవుతూ ఉంటుంది. రేసింగ్ బ్యాక్‌డ్రాప్ సినిమా అయినప్పటికీ మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉన్నాయి. తండ్రీ కొడుకుల భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. ఈ సినిమా స్ఫూర్తినిస్తుంది. ఇక ప్రతిసారీ కొత్త క్యారెక్టర్ చేయాలని ఉండటం వల్లే గ్యాప్ వస్తోంది. ఓ పాత్ర చేసే ముందు ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుంటాను... కొత్తగా అనిపిస్తేనే చేస్తాను" అని తెలిపారు.

# పాతికేళ్ల యువకుడిగా...

## వందో సినిమాలో ఫ్యాన్స్‌కి ట్రీట్



సెంచరీ టచ్ చేయడమంటే ఆ మజా వేరు. ప్రస్తుతం నాగార్జున ఆ జోష్‌లోనే ఉన్నారు. నటుడిగా నూరవ సినిమా మైల్ స్టోన్‌ని టచ్ చేశారు నాగ్. కెరీర్‌లో అత్యంత కీలకమైన మలుపు కాబట్టి తన నూరవ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. నాగార్జున హీరోగా ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు ఆర్ఏ కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే 45 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఈ నేపథ్యంలో ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాగార్జున ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో తాను 25 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు వివిధ దశల్లో, విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నట్లు నాగార్జున ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. పాతికేళ్ల యువకుడిగా కనిపించడానికి 'డీ--ఏజింగ్' టెక్నాలజీని ఉపయోగిస్తున్నారట. అభిమాన హీరో ఇలా తక్కువ వయసులో కనిపించడం అనేది ఫ్యాన్స్‌కి మంచి ట్రీట్‌లాంటిదని చె??పచ్చు. ఇక సాదా సీదా స్థాయి నుంచి కోటీశ్వరుడిగా ఎదిగే ఒక వ్యక్తి ప్రయాణం నేపథ్యంలో సాగే ఈ చిత్రకథ తండ్రీ--కూతుళ్ల మధ్య ఉండే సెంటిమెంట్ చుట్టూ తిరుగుతుందని కూడా నాగార్జున పేర్కొన్నారు. ఈ చిత్రంలో టబు, సుస్మితా భట్, విజయేంద్ర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి 'కింగ్ 100, కింగ్ 100 నాటౌట్, లాటరీ కింగ్' వంటి టైటిల్స్‌ని పరిశీలిస్తున్నారట. ఈ చిత్రాన్ని దసరాకి రిలీజ్ చేయాలనుకుంటున్నారని సమాచారం.

# వంద దేవుళ్లు సాంగ్.. విజయ్ ఆంటోనీ, స్వాసిక 'ఇది కలనో' సాంగ్

తెలుగు, తమిళ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ విజయ్ ఆంటోని. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ శశి డైరెక్షన్‌లో నటించిన చిత్రం బిచ్చగాడు. ఈ మూవీ బాక్సాఫీస్ ఏ రేంజ్‌లో షేక్ చేసిందో తెలిసిందే. తాజాగా ఈ ఇద్దరి కాంబోలో వస్తోన్న మూవీ 'వంద దేవుళ్లు'. ఈ చిత్రం నుంచి ఇది కలనో సాంగ్ విడుదల చేశారు. భాష్య శ్రీ రాసిన ఈ పాటను శిఖి శ్రీనివాసన్, శిరీష భాగవతుల వాయిస్ అందరినీ ఇంప్రెస్ చేసేలా సాగుతుంది. ఇప్పటికే విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. రైతు సమస్యల చుట్టూ తిరిగే బలమైన సామాజిక సందేశంతో వస్తోన్న ఈ మూవీలో స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా కూడా పనిచేస్తున్నాడు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని వేసవిగా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.



Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463